
జన రాజకీయం కోసం... ₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 8
పక్షపత్రిక
సంచిక - 20
అక్టోబర్ 16-31, 2017



## చర్చ మారితేనే బతుకులు మారతాయ్!



## తేడా ఏముంది?



## ఎందుకు ప్రశ్నించటం లేదన్నదే నా ప్రశ్న





## పెట్రో బంకుల్లో అక్రమాలపై 'సురాజ్య' యుద్ధం ప్రారంభం

www.youthforbetterindia.com



# మంచి చదువులు వీరి పిల్లలకేనా ?

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొడుకు, కోడలు అమెరికాలో చదువుకున్నారు.

ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ కుమార్తె కూడా లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో అడ్మిషన్ సంపాదించారు.

తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కొడుకు, కూతురు సైతం అమెరికాలో చదువు, శిక్షణ పొందారు

రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వంలో, ప్రతిపక్షంలో ఉన్న పలువురు రాజకీయ నేతల పిల్లలు కూడా ఇదే స్వదేశంలోనో మంచి విద్యను పొందుతున్నారు

ఇలా నాణ్యమైన చదువులు పొందటం వల్ల ఈ నేతల పిల్లలు వ్యాపారాల్లో, ఉద్యోగాల్లో భారీ ఆదాయాల్నే సంపాదించుకున్నారు.

కానీ ఇదేతరహాలో నాణ్యమైన చదువుల్ని తెలుగు రాష్ట్రాల్లో ఇతర పిల్లలకు అందించటానికి మాత్రం చంద్రబాబు, కేసీఆర్, జగన్, ఇతర నేతలు ఎందుకు ప్రయత్నించటం లేదు? ఎందుకు ఆ చర్చ చేయడం లేదు?

డబ్బు లేదా? ఉంది. మన కడుతున్న పన్నుల డబ్బు సరిపోతుంది.

కానీ చిత్తశుద్ధి లేదు. తమ పిల్లల్లాగా ప్రతి బిడ్డా ఎదగాలన్న సత్సంకల్పం లేదు. వివక్ష లేకుండా అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే మంచి విద్య, ఆరోగ్యం అందించటం రాజకీయం ప్రాథమిక బాధ్యత అన్న స్పృహ అసలే లేదు. ఫీజు రీఇంబర్స్‌మెంట్ ద్వారా ఇంజనీరింగ్ చదివిన పిల్లల్లో పలువురు నిరుద్యోగుల్లా, చిరుద్యోగుల్లా బతకాల్సి వస్తుంటే... ఎందుకు మన చదువులో నైపుణ్యాలు, ప్రమాణాలు లేకుండా పోయాయి? అని ఈ నేతల్లో ఎవరైనా ఆలోచించారా? సమాజాన్ని కదిలించే ప్రయత్నం చేశారా?

నేతల, సంపన్నుల పిల్లలకు అందుతున్నట్టే తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి బిడ్డకూ అందరికీ పాఠశాల స్థాయి నుంచి మంచి విద్యను విద్యారంగానికి ఇప్పుడు కేటాయిస్తున్న నిధులతోనే అందించేందుకు... 'జనం కోసం జేపీ' సురాజ్య యాత్రలో భాగస్వాములవ్వండి.

**Join & Participate: youthforbetterindia.com**

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

అక్టోబర్ 16-31, 2017 సంపుటి - 8 సంచిక - 20





## కార్టూన్ కార్నర్

## లోపలి పేజీల్లో...


చూస్తూ ఉందామా చూస్తూనే........................5
పీహెచ్‌సీలు సరిగా లేకే ............................ 6
కొత్తగా రిజర్వేషన్లను కల్పించటం కన్నా.......... 7
తోటకూర నాడు సామెతే మార్గదర్శి కావాలి..... 8
కొట్టుకుపోనీ కోటిలింగాలు..........................9
ఆ మబ్బులు మాటున కానరాని ......................10
చర్చ మారితేనే బతుకులు మారతాయి.............11
సరైన వైద్య విధానంతోనే 1 కోటి ఉద్యోగాలు.... 12
డబ్బు ఖర్చవుతున్నా సరైన విద్య ......................13
మూడేళ్ళయినా చట్టబద్ధ పాలన కోసం............14
పార్టీలకతీతంగా గ్రామాల్ని అభివృద్ధి.............. 15
చిన్న పరిష్కారాలతో పెద్ద ఫలితాల్ని ............... 16
వేలమంది ఎంబీబీఎస్ నిరుద్యోగులు...............17
గ్రామాలకు ఇస్తున్నది 5పైసల కంటే.................18
ప్రభుత్వాలే ఆటస్థలాలను లాక్కోవడం.............19
ఆముదాల బంద గిరిజన యువత................ 20
ఒక్కో పీహెచ్‌సీకి రూ.2 కోట్లు ఇస్తే చాలు......... 21
ప్రభుత్వ పాఠశాలల బలహీనతే..................... 22
దక్షిణాది జైళ్ళన్నీ కలిపినా చాలవు................. 23
రాజకీయాల్ని మాత్రం అపడేట్ చేసుకో............ 24
గతంలోని మంచిని కొనసాగిస్తూనే ............. 25
పాలకులు మారినా పాలన మారలేదు........... 27
వివక్ష లేకుండా ఎదిగే అవకాశాలు................ 28
మోదీ ఆర్థిక విధానాల పైనా........................ 29
మా మేధావులు అనబడేవాళ్లు ...................... 30
(మీడియాలో) 'కీ' (కామెంట్లు)...................... 32
పెట్రో బంకుల్లో అక్రమ కొలతలు.....................33



### సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్

ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు

డా॥ ఆలూరి విజయలక్ష్మి

కె.వి. కుటుంబరావు


## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.


**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**

తులిప్స్ అపార్ట్‌మెంట్స్

6-3-655, ఫ్లాట్ నెం. 407

సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక

సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**

**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org

loksattatimeslsp@gmail.com


## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*

*ఏడాది చందా : రు. 200*

*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజీ | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత అరిమిల్లి

# వీరి వాదనల్లో మౌలిక తేడా ఏముంది?




కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇటీవల విదేశీ గడ్డ మీద తన మనసులోని మాటపై స్పష్టత ఇచ్చారు. తనను, తన బృందంలోని కొంతమంది యువమిత్రులను మినహాయించి మిగిలిన కాంగ్రెస్ పార్టీనంతా వంశపారంపర్య రాజకీయాల నుంచి బైటపడేసే ప్రయత్నాన్ని కొంతకాలం చేసినట్టు కన్పించిన రాహుల్.. ఇక ఆ కాస్త ప్రయత్నానికి కూడా తిలోదకాలిచ్చినట్టు కనిపిస్తుంది. 'వంశపారంపర్య రాజకీయాలు భారత్‌లో మామూలే' అని ఆయన విదేశాల నుంచి వాణి వినిపించారు. రాజకీయాలను, వ్యాపారాలను, ఇతరత్రా కలాపాలను ఒకేగాటన కట్టారాయన. ఇందుకోసం స్టాలిన్, అఖిలేష్, అంబానీ వంటి వారి పేర్లను ఉదహరించారు. వారసుల్లో కూడా సమర్థులకే అవకాశాలుంటాయని కొసమెరుపు ఇచ్చినా.. రాచరిక వంశపారంపర్య రాజకీయాలను ప్రజాస్వామ్యంలోనూ రాహుల్ సమర్థించదలచుకున్నారన్నది సుస్పష్టం. ప్రకృతి ఇచ్చిన సామర్థ్యాలను వికసింప చేసుకునే అవకాశం కూడా ఇవ్వకుండా పుట్టుకను బట్టి కులం వంటి వివక్షలు మామూలే అనుకునే మనదేశంలో.. 'సామర్థ్యమున్న వారసులకే అవకాశాలు' అనే సూత్రానికి కూడా పరిమితులున్నాయి. రాహుల్ ఈ మాటలన్న సమయంలోనే.. బీజేపీకి సైద్ధాంతిక పునాది సంస్థగా చెప్పుకునే ఆర్ఎస్ఎస్‌కు చీఫ్‌గా ఉన్న మోహన్ భగవత్ స్వదేశంలో మరో కీలక వ్యాఖ్య చేశారు. భారతీయ సంప్రదాయాలు, సంస్కృతికి అనుగుణంగా రాజ్యాంగంలో, శిక్షాస్మృతిలో మార్పులు తేవాలన్నారు. కొన్ని ఉదాహరణలు కూడా చెప్పారు. ప్రకృతి విపత్తులస్తే అమెరికా వంటి సంపన్న దేశాల్లో లూటీలు జరుగుతున్నాయని, కర్ఫ్యూ కూడా విధించారని, భారత్‌లో మాత్రం ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సాయం చేస్తారని అన్నారు. (ఈ మాటలన్న వారంలోనే.. ముంబయిలో ఎల్ఫిన్‌స్టోన్ రైలు వంతెన వద్ద తొక్కిసలాట సమయంలో చావుబతుకుల్లో ఉన్న మహిళలను వేధించటం, వారి ఆభరణాలు లాక్కునే ప్రయత్నం చేయటం, లాస్‌వెగాస్ కాల్పుల ఘటన తర్వాత అనేకమంది అమెరికన్లు రక్తదానం సహా వితరణలివ్వటం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి). ఎమర్జెన్సీ వంటి సందర్భాల్లో పోలీసులు ప్రజలను నడిరోడ్డు మీద కాల్చివేస్తుంటే ఏమీ చెయ్యలేని నిస్సహాయ స్థితిని మన రాజ్యాంగం కల్పించిందని మరో ఉదాహరణ చెప్పారు.. ఒకరకంగా చెప్పాలంటే, ఆర్ఎస్ఎస్, బీజేపీలు హిందూత్వ భారత్ భావజాలం పేరుతో చేస్తున్న వాదనలు రాహుల్ గాంధీలాంటివారు సునాయాసంగా మడమతిప్పడానికి అవకాశమిచ్చాయనుకోవచ్చు. రాహుల్ ప్రకటనను బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఖండిస్తూ, తమ పార్టీ కాంగ్రెస్‌లాగా వారసుల పార్టీ కాదన్నారు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని తమ పార్టీ నుంచి ఎదిగిన సామాన్యులేనన్నారు.. బీజేపీలో దిగువస్థాయిలో ఉన్న వారసులను అలా ఉంచి స్థూలంగా ఆ పార్టీ వంశపారంపర్య రాజకీయాలకు వ్యతిరేకం అని నమ్ముదాం. కనీసం కాంగ్రెస్ కంటే ఈ విషయంలో మెరుగు. కానీ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పేరుతో హిందూయిజంలోని కులం వంటి జాడ్యాలను కూడా సమర్థిస్తున్నప్పుడు.. అదే సంస్కృతి, సంప్రదాయంలో భాగంగా వంశపారంపర్య రాజకీయాలను కొనసాగిస్తున్నామన్న కాంగ్రెస్ వాదనను బీజేపీ ఎలా తోసిపుచ్చగలుగుతుంది? ప్రతిపక్ష పార్టీ తిరోగమన సంస్కృతిని చలామణీ చేసే స్థాయిలో ఆర్ఎస్ఎస్, బీజేపీల భావజాలం ఉండటం దురదృష్టకరం. మానవ హక్కులను ఎడాపెడా ఉల్లంఘిస్తూ, కుల వివక్షతోపాటు మహిళలకు పరిమితులు విధించే సంప్రదాయాలే దేశాన్ని నడిపిస్తాయంటే.. భారతదేశం కొత్తగా ఏమీ చేయాల్సిన అవసరం లేకుండానే అగ్రరాజ్యంగా ఉండాలి. కానీ వాస్తవం అలా లేదు గదా! వెనకబాటుతనాన్ని ప్రదర్శించటంలో బీజేపీ, కాంగ్రెస్ ఇలా రాజీ పడుతుండే.. ప్రజలు ప్రతి ఎన్నికల్లో పెనం, పొయ్యి మధ్య నలిగిపోతున్నారు. కాంగ్రెస్‌కు భిన్నంగా ఉండాలని ఆర్ఎస్ఎస్, బీజేపీ భావిస్తే.. మనదేశానికి ఎంతో బలాన్నిచ్చే కుటుంబ వ్యవస్థ, ఇతర సంప్రదాయాలు, మతం.. వీటికీ, రాజకీయాలకూ ఉన్న గీతను స్పష్టంగా నిర్వచించాలి. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లోని మంచిని పరిరక్షించేందుకు మార్చాల్సింది.. రాజ్యాంగాన్నా? లేక కేంద్రీకృత పాలనను, రాజకీయాన్నా?.. ముందు తేల్చుకోవాలి. ఎన్నో భాషలు, ఎంతో భిన్నత్వం వేల ఏళ్లుగా ఈ దేశంలో వేళ్లూనుకుందీ అంటే, అందులో గ్రామస్వరాజ్యం, బలమైన నగర స్థానిక ప్రభుత్వాలది కీలకపాత్ర కాదా? ఒకపక్క స్వదేశీ సంస్కృతీసంప్రదాయం అంటూనే మరోపక్క స్థానిక స్వయంపాలన ప్రస్తావన లేని కామన్ సివిల్ కోడ్ గురించి మాట్లాడటం ఎంత విచిత్రం, వైరుధ్యం! వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలనిచ్చే నాగరిక, వికేంద్రీకృత రాజ్యాంగ వ్యవస్థను నిర్మించే ఎజెండాను, వేదికల్ని అందించటంలో మన నేతలు, సిద్ధాంతకర్తలు, సామాజికవాదులు పోటీపడితేనే స్వరాజ్యం సురాజ్యంగా మారుతుంది.



# చూస్తూ ఉందామా చూస్తూనే ఉందామా..
# 'జనం కోసం జేపీ' సురాజ్య యాత్రలో
# భాగమై మార్పును సాధించుకుందామా?

**- పగడాల వెంకటేశ్వరరావు**




**పల్లవి:**
చూస్తూ ఉందామా చూస్తూనే ఉందామా
భరతమాత భవితకు పునాదులు వేద్దామా
ఎందరో మహనీయుల త్యాగఫలాలు
కొందరు అవినీతిపరుల పాలవుతుంటే ॥చూస్తూ॥

**చరణం-1:**
కులమతాల వివక్షలను ప్రాంతీయ పగలను పెంచి
జనాన్ని విభజించి పాలించే విషపూరిత నాయకులు
మనిషి మనిషి మధ్యలోన అగ్గి రాజేస్తుంటే
అంబేద్కరు బాపూజీ కలలు కల్లలవుతుంటే
నారాయణగురు చెప్పిన నినాదంపు మారుతుంటే ॥చూస్తూ॥

**చరణం-2:**
మన గనులు, మన భూములు, మన పన్నుల డబ్బులను
రాజకీయ ముసుగులో రాక్షసులై దోస్తుంటే
అడుగడుగున అవినీతి హద్దులు దాటేస్తుంటే
అడిగేవారు ఎవడూ లేక అరాచకం చేస్తుంటే
అన్నీ తెలిసి అడగలేని అసమర్థపు మనుషులను ॥చూస్తూ॥

**చరణం-3:**
తెల్ల దొరల నెదిరించి సాధించిన స్వరాజ్యంబు
నల్ల దొరల నెదరించక స్వాహారాజ్యంబాయె
తరతరాలు గడుస్తున్నా తల ఎత్తుకు బతకలేక
ఉద్యమాలు చేసి యువత ఉద్యోగం లేదంటూ
ఉడుకు రక్తమును చల్లి ఉరికొయ్యలు ఎక్కుతుంట ॥చూస్తూ॥

**చరణం-4:**
ప్రభుత్వాన్ని పన్నులిచ్చి పోషించి ప్రజలంతా
ప్రభువులుగా మన సేవలు హక్కుగ పొందుట కొరకై
ఇంటి ముందు ప్రభుత్వం కంటి ముందు పాలనకై
కదలిరండి జనం కోసం జేపీ సురాజ్య యాత్రలోనికి
వచ్చి చేరండి యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలోనికి
స్వార్థనాయకులు ఏలే స్వాహారాజ్యంబును సమూలంగా మార్చంగ

**J**oin & **P**articipate: www. youthforbetterindia.com

# పీహెచ్‌సీలు సరిగా లేకే పెద్దాసుపత్రి మీద భారం – కాకినాడ సురాజ్య యాత్రలో 'జనం కోసం జేపీ' –



కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి (జీజీహెచ్) నిర్వహణ కోసం ప్రభుత్వం అతితక్కువ నిధుల్ని వెచ్చిస్తోందంటూ లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

సురాజ్య యాత్రలో భాగంగా జీజీహెచ్‌ని సందర్శించిన జేపీ.. తొలుత పర్యవేక్షణాధికారి కార్యాలయంలో ఆసుపత్రికి కేటాయించిన, విడుదల చేసిన నిధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెడికల్, ప్రసూతి వార్డుల్లో పర్యటించారు. పోస్టునేటల్ వార్డులో ఒక మంచానికి ఇద్దరు చొప్పున తల్లీబిడ్డలు ఉండటాన్ని గుర్తించారు. కాళ్లవాపు వ్యాధి బాధితుల్ని పరామర్శించి మాట్లాడారు. ఈ వ్యాధికి సంబంధించి కేసు షీట్లను పరిశీలించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వ్యాధి మూలాన్ని గుర్తించేందుకు, సమూలంగా నిర్మూలించేందుకు చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు. బాధితులకు మెరుగైన సేవలు, పౌష్టికాహారం అందించాలని సూపరింటెండెంట్ ఎం. రాఘవేంద్రరావుకి సూచించారు.



ఆ తర్వాత మాట్లాడుతూ, నిధుల కేటాయింపులో ప్రభుత్వ అలసత్వం సామాన్య ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోందని జేపీ అన్నారు. జీజీహెచ్‌లో ఒక్కో పడకకు ఏడాదికి కనీసం రూ. 30 నుంచి 40లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉందన్నారు. అయితే ప్రభుత్వం మాత్రం రూ. 5. 6లక్షలు మాత్రమే వెచ్చిస్తోందన్నారు. సూపర్ స్పెషాలిటీ పూర్తి చేసి వచ్చిన వైద్యునికి అన్ని ప్రయోజనాలూ కలిపి రూ. 37వేలు నెలజీతంగా ఇస్తుండటం పట్ల విస్మయం వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రభుత్వాలుంటే ప్రజలకు వేరే శత్రువులు అక్కర్లేదన్నారు. పాకిస్తాన్ నుంచో, చైనా నుంచో దురాక్రమణలకన్నా మనం ఎన్నుకున్న స్వదేశీ నేతల విధానాలే మనకు ఎక్కువ ప్రమాదకారులన్నారు. సూపర్ స్పెషాలిటీ వైద్యురాలు కార్పొరేట్ ఆసుపత్రిలో పనిచేస్తే నెలకు కనీసం రూ. 3లక్షల జీతం లభిస్తుందన్నారు. ఈ కారణంగానే వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు అందించేందుకు వెనుకాడుతున్నారన్నారు. వైద్యులు, సౌకర్యాల కొరత జీజీహెచ్‌ని పీడిస్తున్న పెద్ద సమస్యలని, ఇందుకు ప్రభుత్వ విధానాలే ప్రత్యక్ష కారణాలని స్పష్టం చేశారు. జీజీహెచ్ సమస్యలపై ప్రభుత్వానికి సూచనలు చేయడానికి, ప్రభుత్వ పెద్దలతో చర్చించడానికి తాను సిద్ధమేనన్నారు. నిధులు, సిబ్బంది కొరత ఉన్నా, బాధ్యతగా సేవలందించేందుకు ప్రయత్నిస్తున్న జీజీహెచ్ బృందాన్ని జేపీ అభినందించారు. జీజీహెచ్‌లోని రంగరాయ సోషల్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఎస్‌పీఎం) గ్యాలరీలో విద్యార్థులతో, మెడికోలతోనూ జేపీ మాట్లాడారు. సమాజంలో వైద్యులకు ప్రత్యేకస్థానముందని, దాన్ని నిలబెట్టుకునే విధంగా రోగులకు సేవలందించాలన్నారు. వైద్య ఆరోగ్య రంగంలో ఉద్యోగావకాశాల్ని వినియోగించుకునేలా ప్రభుత్వ విధానాలుండాలన్నారు. లోక్‌సత్తా ఉద్యమ ఏపీ, తెలంగాణ సమన్వయకర్త బండారు రామ్మోహనరావు, వైబీఐ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ❍

## ఏజెన్సీలో తక్షణ వైద్యచర్యలు చేపట్టండి

***ఉభయ గోదావరి జిల్లాల్లో సామాన్య, మధ్యతరగతికి ఆరోగ్య ఆసరాగా ఉన్న కాకినాడ జీజీహెచ్ (బోధనాసుపత్రి)కి రోగుల తాకిడి పెరగటానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అధ్వాన్నంగా ఉండటమే కారణమని జేపీ అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రులను బలోపేతం చేస్తే.. చిన్నపాటి అనారోగ్యానికి కూడా సుదూర ప్రాంతాల నుంచి జీజీహెచ్‌కు రావాల్సిన ఆగత్యం ప్రజలకు తప్పుతుందని, పెద్దాసుపత్రి మీద కూడా భారం తగ్గి సేవల నాణ్యత పెరిగే అవకాశముందని అన్నారు. వ్యాధుల నివారణ మీద దృష్టి పెట్టాలని, ఏజెన్సీలో వైద్యసిబ్బందిని తక్షణం భర్తీ చేసి వాహనాలు, మందులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.***

# కొత్తగా రిజర్వేషన్లను కల్పించటంకన్నా ప్రాథమిక విద్యను బలోపేతం చేయటం వల్లే లాభం





***1993లో ముంబయిలో అల్లర్లు జరిగితే 24 ఏళ్ల తర్వాత కొంతమంది నిందితులకు మాత్రమే శిక్ష పడిందని జేపీ అన్నారు. మౌలిక సదుపాయాల విషయంలో 57 దేశాలలో మనం 55వ స్థానంలో ఉన్నామన్నారు. మౌలిక వసతులు, విద్య, ఆరోగ్యం లేకుండా, చుట్టూ సమస్యల్ని పరిష్కరించుకునే అవకాశాలు, న్యాయం అందే ఏర్పాటు లేకుండా చేస్తున్న లంచాల పాలన గురించి నేతలు డబ్బా కొట్టుకోవచ్చేమోగానీ.. విద్యార్థులు, యువత, తల్లిదండ్రులకు మాత్రం భరించలేని భారమన్నారు.***

కొత్తగా రిజర్వేషన్లు కల్పించి నిరుద్యోగులను పెంచటంకన్నా ప్రాథమిక విద్యను బలోపేతం చేసి అందరికీ మంచి విద్యను అందించే ఏర్పాటు చేస్తే యువత లాభపడతారని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

'జనం కోసం జేపీ' సురాజ్య యాత్రలో భాగంగా ఆయన కాకినాడ పీఆర్ డిగ్రీ కాలేజీలో విద్యార్థులతో మాట్లాడారు.

ఓట్ల కోసం ప్రజల ఆలోచనాశక్తిని దెబ్బతీసేలా, తాత్కాలిక సుఖాలకు లొంగేలా ప్రభుత్వ విధానాలు, స్కీములు ఉంటున్నాయని.. ఈవేళ రిజర్వేషన్ల పొడిగింపు కూడా అలాంటి తాయిలమేనని జేపీ అన్నారు. కనీసం కూడికలు, తీసివేత, భాగాహారం కూడా తెలియని 8వ తరగతి విద్యార్థులున్నారన్నారు. స్కూలు విద్యార్థులపై చేసిన పీసా' సర్వేలో 74 దేశాల మధ్య మన దేశం 73వ స్థానంలో ఉందన్నారు. ఇలాంటి చదువుతో పై తరగతులకు వెళ్తే ఏం జరుగుతోందో నానాటికీ పెరుగుతున్న నిరుద్యోగాన్ని చూస్తేనే అర్థమవుతుందన్నారు. ఎంత ఎక్కువ చదువుకుంటే అంత ఎక్కువ నిరుద్యోగం అనే దుస్థితిని పాలకులు కల్పిస్తున్నారన్నారు. పెద్దఎత్తున నిరుద్యోగ భృతి కల్పించాల్సిన దుస్థితి ఏర్పడినా పాలకులు దిద్దుబాటు చేయటం లేదన్నారు. ఉన్న వనరుల్ని, యువత భవిష్యత్తును దెబ్బతీసేలా ఉన్న విధానాలను మారిస్తేనే, రాష్ట్రాభివృద్ధి, సురాజ్యం సాధ్యమన్నారు. తమంతట తాము మారని పాలకులను సురాజ్యం దిశగా ఆచరణసాధ్యమైన విధానాలతో నడిపించేందుకు విద్యార్థులు, యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఏ రకంగా మన చుట్టూ ఉన్న ప్రాంతంలో, రాష్ట్రంలో, దేశంలో మార్పులు వస్తాయో, సంఘటితంగా ఏం చేయొచ్చో తెలియచేసేందుకు యువత కోసం 'యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్' ప్లాట్‌ఫాంను అందిస్తున్నామని, ఇందులో ఎటువంటి రుసుమూ లేకుండా పేరు నమోదు చేసుకుని కార్యక్రమాలు చేసుకోవచ్చని అన్నారు. అలాగే ప్రజలు రోజువారీ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్' ప్లాట్‌ఫాంను అందుబాటులోకి తెచ్చామన్నారు.

కులం, మతం, ప్రాంతంతో సంబంధం లేకుండా.. పరిష్కారంలో భాగమవ్వాలనుకున్నవారంతా ఇందులో చేరి స్వేచ్ఛగా పనిచేసుకోవచ్చన్నారు. ఎంతో ఘనచరిత్ర గల కాకినాడలో ఎక్కడ చూసినా మురికి కంపు, పొంగి పొర్లుతున్న డ్రైనేజీ కనిపిస్తున్నాయని, ప్రజలు అతలాకుతలమవుతున్నారని అన్నారు. కనీసం చుట్టూ ఉన్న సమస్యలను పరిష్కరించుకునేందుకు ఏం చేయాలో కూడా తెలియని దుస్థితి 70 ఏళ్ల స్వతంత్రం తర్వాత కూడా కొనసాగుతోందన్నారు. ఏం కావాలన్నా ఎమ్మెల్యేనో, ఎంపీనో, కమిషనర్‌నో అడగాల్సి వస్తోందన్నారు. ప్రతిష్టాత్మకంగా బోలెడు ఖర్చు పెట్టి వార్డుల్లో గెలిచినవారికి, చివరికి మేయర్‌కు కూడా అధికారాలు లేని విచిత్రమైన వ్యవస్థ నడుస్తోందన్నారు. జనం అభివృద్ధికి, భావితరాలను తీర్చిదిద్దడానికి అవరోధంగా ఉన్న ఇలాంటి సమస్యలను పెద్దఖర్చు లేకుండానే, వేగంగా పరిష్కరించుకునేందుకు యువత, ఇతర ప్రజలు సురాజ్య ఉద్యమంలో భాగస్వాములు కావాలని, వెబ్ ప్లాట్‌ఫారాలలో నమోదై చిన్న చిన్న కార్యక్రమాలతో పెద్ద ఫలితాలను సాధించాలని కోరారు. అనంతరం విద్యార్థుల సమస్యలను చర్చిస్తూ వారు అడిగిన ప్రశ్నలకు జేపీ జవాబిచ్చారు. ❍




# తోటకూర నాడు.. సామెతే మార్గదర్శి కావాలి, ఆకతాయిలకు ఉద్యోగావకాశాల్లో కట్ చేయాలి

చిన్న పిల్లల స్థాయి నుంచి మహిళల భద్రత తెలుగు రాష్ట్రాల్లో, దేశంలో ఆందోళన కలిగిస్తోందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ అన్నారు. చట్టబద్ధ పాలన సక్రమంగా లేకపోవడంతో స్త్రీలు, దళితులు, బీసీలు, పేదలే ఎక్కువ మూల్యం చెల్లిస్తున్నారన్నారు. 'తోటకూర నాడు..' సామెత పాఠంతో.. అసభ్యంగా ప్రవర్తించటం దశ నుంచే చర్యలు ఉంటే మహిళలకు చాలామేర భద్రత కల్పించటం సాధ్యమవుతుందని, దీనికి పెద్ద ఖర్చు కూడా అవదని, ఈ దిశగా చర్యలు తీసుకోకుండా ప్రభుత్వాలు ఎందుకు తాత్సారం చేస్తున్నాయో అర్థం కావటం లేదని అన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్ర కాకినాడ చేరుకుంది. ఇందులో భాగంగా స్థానిక బార్ అసోసియేషన్‌ను జేపీ సందర్శించి న్యాయవాదులతో సమావేశమయ్యారు. తక్షణ పెనుసమస్యగా ఉన్న మహిళల భద్రతపై ప్రధానంగా చర్చించి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

విద్యార్థులు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించేవారికి 24 గంటల్లోగా జరిమానాలు విధించడం, ఆన్‌లైన్ వ్యవస్థతో సంధానం చేసి ఉన్నత విద్య, ఉద్యోగాలలో అవకాశాలు లేకుండా చేయడం వంటి చర్యలు తీసుకుంటే చాలావరకు వేధింపుల్ని అరికట్టవచ్చని జేపీ అన్నారు.

దాంతోపాటు చిన్న నేరాలకు వెంటనే, పెద్ద ఖర్చు లేకుండా శిక్ష విధించే ఏర్పాటు లేకపోవడం వల్ల వేధింపుల నేరాలు అత్యాచారాల దాకా వస్తున్నాయని, నేరస్తులు కరడుగట్టి పోతున్నారని జేపీ అన్నారు. ఇలా చిన్న కేసులను పరిష్కరించేందుకే లోక్‌సత్తా 2009లో స్థానిక న్యాయాలయాల చట్టాన్ని పార్లమెంటులో పార్టీల్ని ఒప్పించి తీసుకొచ్చిందని.. కానీ ఇంతవరకూ తెలుగు రాష్ట్రాల్లో ఒక్క స్థానిక కోర్టును కూడా ఏర్పాటు చేయలేదని అన్నారు.

దుడ్డుకర్ర ఎవరి చేతిలో ఉంటే వారిదే పైచేయి అవుతోందని, న్యాయం జరుగుతుందన్న నమ్మకం ప్రజల్లో సన్నగిల్లితే సమాజం తీవ్రంగా నష్టపోతుందని, తమ భవిష్యత్తుని, సమాజహితాన్ని కోరేవారంతా న్యాయసంస్కరణల కోసం ప్రభుత్వాల మీద గట్టి ఒత్తిడి తేవాలని జేపీ కోరారు. మాజీ ప్రధానిని చంపిన కేసులో శిక్ష ఖరారుకు 18 ఏళ్లు పడితే సామాన్యులకు భరోసా ఎక్కడుందని ప్రశ్నించారు. భవిష్యత్తు యువతరానిదేనని, మార్పు కోసం చేయాల్సిన పనులను వారు పట్టించుకుని తమ వంతుగా కృషి చేయకపోతే నష్టం పెరుగుతుంటుందని గుర్తించాలన్నారు. ఈ అంశాలపై అవగాహనకు సురాజ్య యాత్ర ఉపయోగపడుతుందని, క్షేత్రస్థాయిలో పనిచేసేందుకు వేదికలుగా యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లు సహాయపడతాయని వివరించారు.

ప్రజలకు చట్టాలపై, నేరపరిశోధనపై అవగాహన పెంచేందుకు న్యాయవాదులు కృషి చేయాలని జేపీ విజ్ఞప్తి చేశారు. 125 ఏళ్ల విశిష్ట చరిత్ర కలిగిన కాకినాడ నగరం ఎంతోమంది నిపుణులైన న్యాయవాదులు, వైద్యులు, కవులు, కళాకారులను, పలువురు మహానుభావులను అందించిందని, అప్పటికి ఇప్పటికి సమాజంలో ఎంతో వ్యత్యాసం ఏర్పడిందని అన్నారు. పక్షపాత రాజకీయాలను పక్కనపెట్టి ప్రభుత్వాలు పారదర్శకంగా పాలన నడిపేలా వ్యవహరించాలన్నారు. పోలీసు స్టేషన్లో ఫిర్యాదులు చేయాలన్నా ప్రజల్లో అనేకమంది వణికిపోతున్నారని, రిజిస్ట్రేషన్ శాఖలో అవినీతి వల్ల నల్లధనం పెరిగిపోతోందని, ఇలాంటి ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వ కార్యాలయాల్లో 'పౌర సేవల' చట్టం ఏర్పాటు చేయాలని అన్నారు. ఇలాంటి పరిష్కారాలకు న్యాయవాదులు గళం అందిస్తూ సురాజ్యానికి దోహదం చేయాలన్నారు.

బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బచ్చు రాజేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపాధ్యక్షుడు చిక్కాల సత్యనారాయణ, గోకుల కృష్ణ, అడ్వకేట్ జవహర్ అలీ, రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షుడు వైడీ రామారావు, బండారు రామ్మోహనరావు, వైబీఐ ప్రతినిధులు పాల్గొన్నారు. ❍



# కొట్టుకుపోనీ కోటి లింగాలు.. వీరేశలింగం మిగిలితే చాలు !

ఎన్నికల సమయంలోలా నిత్యం జనం చుట్టూ పాలన తిరుగుతుంటేనే సురాజ్యం సాధ్యమని జేపీ అన్నారు. జనహితం కోసం చేపట్టిన జేపీ సురాజ్య యాత్ర రాజమహేంద్రవరానికి చేరుకుంది.

ఈ సందర్భంగా ఫ్రీడం పార్కులో స్వాతంత్ర్య సమరయోధులతో, నగర ప్రముఖులతో జేపీ సమావేశమయ్యారు.

మనదేశానికి అపారమైన శక్తిసామర్థ్యాలు, యువశక్తి, వనరులు అన్నాయని, సురాజ్యం లేకపోవటం వల్లే దశాబ్దాలు గడుస్తున్నా ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఉందని జేపీ అన్నారు. మహాత్మాగాంధీ వంటి మహానేతల ఉద్యమాలను ఇప్పుడు పాలనా వ్యవస్థలో మార్పు కోసం సరికొత్త పద్ధతుల్లో చేయాల్సి ఉందన్నారు. ఇందుకోసమే సురాజ్య యాత్ర, సురాజ్య వేదికలు అన్నారు.

ఇటీవల జరిగిన కాకినాడ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో రూ. 70కోట్లు ఖర్చు పెట్టి గెలిచినట్టు చెబుతున్నారని, ఈ డబ్బంతా ఎక్కడి నుంచి వచ్చిందని జేపీ ప్రశ్నించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న 38 లక్షలమంది భవిష్యత్తు గురించి మాట్లాడరుగానీ, కోట్లు ఖర్చు పెట్టయినా ఎలా అధికారంలోకి రావాలో చర్చించటానికి మాత్రం మీటింగుల మీద మీటింగులు పెడతారన్నారు. దేశంలో ఏటా 12లక్షలమంది ఐదేళ్ల లోపు పిల్లలు చనిపోతున్నా ఆరోగ్యాన్ని చర్చించటం మన పాలకులకు పెద్ద అంశంగా కనిపించటం లేదన్నారు. పౌష్టికాహార లోపం జాతి జవజీవాల్ని హరిస్తోందన్నారు. ఏటా వేల, లక్షల కోట్లు సంక్షేమం పేరుతో ఖర్చు చేస్తున్నా ఏమవుతున్నాయో లెక్కా, జమా లేదన్నారు. ఇలాంటి స్వరాజ్యం కోసమా మనం స్వాతంత్ర్యం సాధించింది? అని ప్రశ్నించారు.

ఆదర్శ భావాలలో ఈతరం గతతరం కంటే ఏమాత్రం తీసిపోదని, అయితే మనలోని ఆదర్శ భావనల్ని నిరంతరం కాపాడుకోవాలని, మెరుగైన ఆదర్శం దిశగా నిరంతరం సాగుతుండాలని జేపీ అన్నారు. కొట్టుకుపోనీ కోటి లింగాలు.. వీరేశలింగం మిగిలితే చాలు అన్న కవి పలుకుల అంతరార్థాన్ని గ్రహించాలన్నారు. సొంత లాభం చూసుకుంటూనే సమాజానికి మేలు చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ముఖ్యంగా కాస్త ఆదాయం, చదువు ఉన్నవారు తాత్కాలిక లాంతర్ల వెలుతుర్లకు పరిమితం కాకుండా, దూర నక్షత్ర కాంతులను లక్ష్యంగా పెట్టుకుని కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన రోజున గాంధీజీ సంబరాల్లో మునగలేదని, ఓ గదిలో మౌనంగా కూర్చున్నారని, వేరే ఎక్కడో బాధితుల్ని పరామర్శించేందుకు వెళ్లారని.. నిజమైన స్వరాజ్యం కోసం ఆయన ఆరోజే ఆందోళన చెందారని గుర్తుచేశారు. ప్రస్తుతమున్న పైపై స్వరాజ్యాన్ని సురాజ్యంగా మార్చేందుకే సురాజ్య యాత్ర చేస్తున్నామన్నారు. అవగాహనతో, చిన్న ప్రయత్నాలతోనే సురాజ్యాన్ని సాధించుకోవచ్చన్నారు. ప్రభుత్వం చేస్తున్న ప్రతి రూపాయికీ ఎలాంటి ఫలితం వస్తోందో ప్రజలు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు.

వెలమాటి సత్యం, మరో ఇద్దరు స్వాతంత్ర్య సమరయోధుల్ని జేపీ ఈ సందర్భంగా సత్కరించారు. రాష్ట్రపతి పురస్కార గ్రహీత, ప్రజ్ఞా రాజహంస చింతలపాటి శర్మ, పద్యకవి తిలక డాక్టర్ ఎస్వీ రాఘవేంద్రరావు, భావకవి మహ్మద్ ఖాదర్ ఖాన్, లోక్‌సత్తా, వైబీఐ నేతలు, ప్రతినిధులు పాల్గొన్నారు. ❍

# ఆ మబ్బుల మాటున కానరాని భాస్కరులెందరో!
# లక్షమంది సురాజ్య యోధులను తయారుచేస్తాం: జేపీ




జనం జీవితాల్లో ఎప్పుడో రావాల్సిన, ఇప్పటికీ రాకుండా వున్న మేలి మార్పును సాధించటం కోసమే 'జనం కోసం జేపీ' సురాజ్య యాత్రను ప్రారంభించామని డా॥ జయప్రకాష్ నారాయణ్ తెలిపారు. ఇది టెక్నాలజీని వినియోగించుకుంటూ జరిగే ఈతరం వినూత్న ఉద్యమమన్నారు. ఒకరకంగా ఇది లోక్‌సత్తా మలిదశ (2.0) ఉద్యమం కూడానన్నారు. జిల్లాల్లో కొన్నిరోజుల చొప్పున జరుగుతున్న ఈ ఉద్యమంలో అనేక విషయాలు బైటపడుతున్నాయన్నారు. సెప్టెంబర్ 15, 2017న విశాఖపట్నం నుంచి ప్రారంభించిన సురాజ్య ఉద్యమం 100 రోజుల యాత్ర ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ముగిసేలోగా లక్షమంది యోధులను తయారుచేయాలన్న లక్ష్యాన్ని సాధించగలమన్న పూర్తి విశ్వాసం క్షేత్రస్థాయి పర్యటనల తర్వాత కలుగుతోందన్నారు. ప్రచారం లేకుండానే సమాజం కోసం నిండుమనసుతో పనిచేస్తున్న పలువురు యువకులు, ఇతర వయసుల పౌరులు కనిపించారన్నారు. వివిధ కారణాల వల్ల వారి సామర్థ్యం మబ్బులమాటున దాగున్న సూర్యుని వలే కనిపించటం లేదన్నారు. ఇలాంటివారిని యూత్ ఫర్ బెటర్ ఇండియా, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా వెబ్ ప్లాట్‌ఫారాల మీద సమీకరించి, వారి అవగాహనను పెంచి, సంఘటితంగా తమ చుట్టూ ఉన్న సమస్యల్ని పరిష్కరించుకునేలా చేస్తామన్నారు. వీరందరికీ హైదరాబాద్‌లో శిక్షణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వ్యక్తి సుఖాన్ని–సమాజహితాన్ని అనుసంధానం చేయటం సురాజ్య యాత్ర మౌలిక లక్ష్యమన్నారు. వెబ్ ప్లాట్‌ఫారాలలో నమోదయ్యేవారిలో కొందరు మరింత అవగాహన, చైతన్యం కలవారున్నారని, వీరికి అదనపు శిక్షణనిచ్చి నాయకత్వ స్థాయిలో సురాజ్య సాధకులుగా తీర్చిదిద్దుతామన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా రాజమండ్రిలో జేపీ కలియతిరిగారు. ఎంత డబ్బయినా ఖర్చు పెట్టి, ఏం చేసైనా అధికారంలోకి రావడమే లక్ష్యంగా తెలుగు రాష్ట్రాల్లో, మనదేశంలో కొనసాగుతున్న రాజకీయం వల్ల చదువు, ఆరోగ్యం, ఉపాధి, మౌలిక వసతులు, చట్టబద్ధ పాలన వంటి కనీస అవసరాలు కూడా తీరడం లేదని, ఈ ఉచ్చు నుంచి బైటపడితేనే బతుకులు బాగుపడతాయని, ఇదే సురాజ్యమని వివిధ వర్గాల ప్రజలకు వివరించారు. బాలికలు, యువతులు, మహిళలు, పిల్లలు బైటికెళ్తే క్షేమంగా వచ్చే పరిస్థితి లేని, ఆరుగాలం కష్టపడినా రైతుకు కనీస ఆదాయం లేని స్వరాజ్యమెందుకు అని ప్రశ్నించారు.

పెద్ద నోట్ల రద్దుతో మోదీ పార్టీ ఎన్నికల్లో గెలిచిందిగానీ, ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఓ ప్రశ్నకు సమాధానంగా జేపీ చెప్పారు. నోట్ల రద్దును మొట్టమొదట సమర్థించినవారిలో తానొకడినని, అయితే కనీసం ప్రజలు ఇచ్చిన డబ్బుకు తిరిగి వెంటనే డబ్బు చెల్లించే ఏర్పాట్లు కూడా చేయకుండా నోట్ల రద్దును అమలుచేసేంత అధ్వాన్నంగా, అసమర్థంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్న ఊహ కూడా తనకు కలగలేదన్నారు. ఇంత జరిగాక కూడా, నోట్ల రద్దు వల్ల ప్రజలు పడ్డ కష్టానికి న్యాయం చేద్దాం, అవినీతిని అంతం చేద్దాం అని ప్రధాని స్పష్టమైన సంస్కరణలు చేపట్టటం లేదన్నారు. అవినీతి అంతానికి పౌర సేవల చట్టం నుంచి ఎన్నికల సంస్కరణల వరకు చేయాల్సిన, వెంటనే చేయగలిగిన మార్పులను లోక్‌సత్తా పలుమార్లు మోదీ దృష్టికి తీసుకెళ్లిందన్నారు. అసంపూర్ణ స్వరాజ్యంలో ప్రజల నిస్సహాయతతో ఆడుకోవటం ఎల్లవేళలా సాగదని, ప్రజల్లో చైతన్యం పెరిగి సురాజ్యం సాధ్యమని ఉద్ఘాటించారు. విద్యార్థులు, యువత, పౌరప్రముఖులు, లోక్‌సత్తా, వైబీఐ ప్రతినిధులు పాల్గొన్నారు. ❍

# చర్చ మారితేనే.. బతుకులు మారతాయ్



రాజకీయం, పాలనలో చర్చ, ప్రాధాన్యతలు మారితేనే మన బతుకులు మారతాయని జేపీ అన్నారు. ఉన్న వనరులతో ఏం చేస్తే మనకు ఎదిగే అవకాశాలు వస్తాయో, మనకు ఆదాయాలు పెరుగుతాయో.. ఇవి తప్ప అన్నీ మాట్లాడుతున్నాం, డిమాండ్ చేస్తున్నామన్నారు. సరైన చర్చను జనంలో పెంచేందుకే, ఆ దిశగా నేతలను, రాజకీయ పార్టీలను మరల్చేందుకే, వాటిలో కొన్ని లక్ష్యాలను సాధించేందుకే సురాజ్య యాత్రను చేపట్టామన్నారు.

*డబ్బు ప్రభావం వల్లే ఎన్నికల రాజకీయాల నుంచి వెనక్కుతగ్గాం*

*డబ్బు చుట్టూ రాజకీయాల వల్లే లోక్‌సత్తా పార్టీ ఎన్నికల్లో పోటీ నుంచి వైదొలిగిందని జేపీ వివరించారు. ఒక స్వచ్ఛంద సామాజిక సంస్థగానే సురాజ్య యాత్రను చేపట్టామన్నారు. ఇది పార్టీలకతీతమన్నారు. పెద్ద ఖర్చు లేకుండా పరిష్కారమయ్యే సామాన్య ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించటమే ఈ సురాజ్య యాత్ర లక్ష్యమన్నారు.*

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా ఆయన తూర్పు గోదావరి జిల్లాలో ఆయన వివిధ వర్గాల ప్రజలను కలుసుకుని మాట్లాడారు.

మన బతుకులు బాగు పడాలంటే, మంచి విద్య, ఆరోగ్యం, ఆదాయం పెరిగే ఉపాధి, లాభసాటి వ్యవసాయం, ఉన్న ప్రాంతంలోనే చక్కటి వనరులు, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు లేకుండా పనులు కనీస అవసరాలని జేపీ అన్నారు. స్వతంత్రం వచ్చి 70 ఏళ్లయినా, ఎన్నో తరాలు గడిచిపోయినా ఇప్పటికీ ఎందుకు వీటిని సాధించలేదో ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు.

ఈ కనీస లక్ష్యాలను సాధించేందుకే ఆరు అంశాలలో చిన్న చిన్న పరిష్కారాలతో, ప్రజలు తమంతట తాము తేలిగ్గా అమలు చేయగలిగిన పరిష్కారాలతో సురాజ్య యాత్ర వచ్చిందన్నారు.

**గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజల కోసం పనిచేస్తున్నా**

ఎన్నికలు సమీపిస్తున్నాయి కాబట్టి లోక్‌సత్తా సురాజ్య యాత్ర చేపట్టిందన్న విమర్శను జేపీ కొట్టిపారేశారు. ప్రజల పట్ల ప్రేమ, ప్రజాప్రయోజనాల గురించి అవగాహన ఉన్నవారెవరూ ఇలాంటి తప్పుడు విమర్శలు చేయరన్నారు. ఎన్నికల్లో ఓడినా, పదవులు లేకపోయినా ప్రజలను పట్టించుకోబోమని నేతలు బహిరంగంగానే ప్రకటించే మన వ్యవస్థలో.. గెలుపోటములతో సంబంధం లేకుండా లోక్‌సత్తా ప్రజల పక్షాన కృషి చేస్తోందన్నారు. గత 21 ఏళ్లుగా పలు రాజ్యాంగ సవరణల్ని, చట్టాల్ని, విధానపరమైన మార్పుల్ని సాధించామన్నారు. 2014 ఎన్నికల్లో పార్టీకి ఓట్లు, సీట్లు రాకపోయినా.. గత మూడున్నరేళ్లుగా అనేక అంశాలలో దేశవ్యాప్తంగా చర్చలు, అవగాహన, ప్రచార కార్యక్రమాలలో పాల్గన్నానని, ప్రభుత్వాలకు తాను విధానపరమైన అంశాల్లో తోడ్పడుతూ వచ్చానని, తాజా సురాజ్య యాత్ర కోసం కసరత్తు చేశామని తెలిపారు.

కులం, తాయిలాల దృష్టితో ఆలోచిస్తే నష్టపోతూనే ఉంటామని, సురాజ్య ఎజెండాను డిమాండ్లుగా చేసుకోవాలన్నారు.

సమాజానికి సేవ చేయాలంటే రాజకీయ పార్టీల్లోనే చేరక్కర్లేదని, రాజకీయ పదవులనే సంపాదించనక్కర్లేదని, తమకున్న స్వేచ్ఛ, సామర్థ్యాలతో ప్రజలు తమ జీవితాల్ని బాగుచేసుకుంటూనే చుట్టూ ఉన్న సమాజాన్ని బాగు చేసుకోవచ్చని జేపీ అన్నారు. మహిళలు, యువత తమకుండే ఖాళీ సమయంలో కొంతైనా సామాజిక ప్రయోజనాల కోసం వెచ్చించాలని విజ్ఞప్తి చేశారు. ఏం చేయాలో సరైన మార్గదర్శకత్వం కోసం యూత్ ఫర్ బెటర్ ఇండియా, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా వెబ్ ప్లాట్‌ఫారాల ద్వారా తెలుసుకోచ్చన్నారు. ○

# సరైన వైద్య విధానంతో 1కోటి ఉద్యోగాలు



నాణ్యమైన వైద్య విధానం తెండయ్యా, ప్రజలు అల్లాడుతున్నారు అని పాలకులకు లోక్‌సత్తా స్పష్టమైన విధానాన్ని రూపొందించి మరీ ఇచ్చిందని, ఈ నమూనాను అమలు చేస్తే పెద్ద వ్యయం లేకుండానే దేశంలో 1కోటి ఉద్యోగాలు వస్తాయని జేపీ అన్నారు. కేవలం వైద్యం అందకపోవటం వల్లే దేశంలో పేదరికంలో మగ్గిపోతున్నవారు ఏటా కోట్ల మంది ఉన్నారన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలు తాత్కాలిక ఉపశమనాలేనని, అవి ప్రజల అవసరాలకు ఏమాత్రం చాలవని అన్నారు. ప్రజలకన్నా కూడా ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులవారికి అవి ఎక్కువగా ఉపయోగపడు తున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రూ. 2,000కోట్లు అదనంగా కేటాయిస్తే దాదాపు అందరికీ మంచి వైద్యాన్ని ఖర్చు లేకుండా అందిచవచ్చున్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా తూర్పు గోదావరి జిల్లా ముమ్మిడివరంలోని ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలోని అనన్య ఆడిటోరియంలో విద్యార్థులు, రైతులతో ఆయన మాట్లాడారు.

సురాజ్య యాత్రలో క్షేత్రస్థాయి సమస్యల్ని పరిశీలిస్తున్నకొద్దీ లోక్‌సత్తా ప్రతిపాదించిన వైద్య ఆరోగ్య విధానం అమలు తక్షణావసరమని స్పష్టమవుతోందని జేపీ అన్నారు. ఇందులోని అంశాలన్నీ తక్షణం ప్రభుత్వాలు కొద్దిపాటి అదనపు నిధులతో చేయగలిగిన అంశాలేనని అన్నారు. ప్రపంచంలో అగ్రరాజ్యంగా ఉన్న అమెరికాలో ప్రస్తుతం వైద్యరంగంపై పెద్ద చర్చ జరుగుతోందని, మనదేశంలో అభివృద్ధికి, ఉద్యోగాలకు కీలకమైన రంగాల గురించిన చర్చే లేదన్నారు. ఏటా 6 కోట్లమంది పేదరికంలోకి వెళ్తున్నా, దాదాపు 12లక్షల మంది ఐదేళ్లలోపు చిన్నారులు మృత్యువాత పడుతున్నా అవన్నీ మామూలే అన్నట్టు వ్యవహరిస్తున్నారన్నారు. ఇది కచ్చితంగా వ్యవస్థలో వైఫల్యమేనన్నారు.

విద్య, వైద్య రంగాలు బాగుపడితే యువత, రైతులు, మధ్యతరగతి తెరిపిన పడతారని జేపీ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థి ఎక్కడైనా పోటీపడి నెగ్గగలిగితేనే అది సార్థకత గల విద్యావ్యవస్థ అవుతుందన్నారు. అందరూ కలిసొస్తేనే విద్యారంగాన్ని బాగు చేయగలమన్నారు. వైద్యానికన్నా కొంత ఖర్చవుతుందిగానీ, విద్యను ఇప్పుడు కేటాయిస్తున్న డబ్బుతోనే నాణ్యమైనదిగా చేయ వచ్చన్నారు.

నెల రోజుల్లోనే పంట ధరలు తారుమారు కావడం, రుణాలకు భారీ వడ్డీలను చెల్లించటం, పట్టాదారు పాసుపుస్తకాలకు లంచాలు వంటి సమస్యల్ని రైతులు ఏకరువు పెట్టగా.. ఈ సమస్యలు దశాబ్దాలుగా ఉండొచ్చుగానీ, వీటికి స్పష్టమైన, వెంటనే అమలు చేయగల పరిష్కారాలున్నాయని జేపీ వివరించారు. దేశంలోని 50శాతం మంది రైతులు వ్యవసాయం మీద ఆధారపడితే, వారికి దేశ ఆదాయంలో కేవలం 14శాతం వస్తోందన్నారు. ప్రకృతి వైపరీత్యాలకన్నా పాలకుల విధానాలలోనే సమస్య ఉందని వివరించారు. ఇతర దేశాల నుంచి నూనె, పప్పులు అసంబద్ధంగా దిగుమతి చేసుకోవడం వల్ల 20 బిలియన్ల డాలర్లు నష్టపోతున్నామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పౌర సేవల చట్టం ద్వారా లంచాలు, దేబిరింపులు అవసరంలేకుండానే ఎలా పట్టాదారు పుస్తకం వంటివి పొందవచ్చో తెలియచెప్పారు. ప్రకృతి వైపరీత్యాల ద్వారా వచ్చే నష్టాల్ని ఆపలేకపోవచ్చుగానీ, పాలకుల విధానాల్ని మార్చే శక్తి ప్రజలకు ఉందని, ఆ శక్తిని జాగృతం చేసి దిశానిర్దేశం చేసేందుకే సురాజ్య యాత్రను చేపట్టామని తెలిపారు.

లోక్‌సత్తా ఉద్యమం ద్వారా మూడు రాజ్యాంగ సవరణలు, సమాచార హక్కు చట్టం వంటి 8 కీలక చట్టాలు, పలు విధానపరమైన సంస్కరణల్ని తీసుకొచ్చామని, ఒక్క ఎంపీ కూడా లేకుండానే ఇవన్నీ సాధించామని, విషయ పరిజ్ఞానంతో సంఘటితంగా పోరాడితే కచ్చితంగా మార్పును చూడవచ్చని జేపీ అన్నారు. యువత ఆలోచనలు తమతో పంచుకోవడానికే యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా ఉభయ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహనరావు, జిల్లా కన్వీనర్ మాచిరాజు, ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ పెన్మత్స జగ్గప్పరాజు, లోక్‌సత్తా పార్టీ నేత ముదునూరు రాజ్ వర్మ, వైబీఐ ప్రతినిధులు పాల్గొన్నారు. ❍

# డబ్బు ఖర్చవుతున్నా సరైన విద్య ఎందుకు అందటం లేదో తేల్చాలి – జేపీ



తెలుగువారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలంటే విద్యారంగాన్ని గాడిలో పెట్టాలని జేపీ అన్నారు. విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అయినా, దానిపై చర్చ మనకు కీలకం కావటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మన జీవితాలకు సంబంధించిన విషయాలు కాకుండా, చాలా పైపై విషయాల గురించి చర్చించటం ఆనవాయితీగా మారిందన్నారు. దమ్మిడీ ఉపయోగంలేని కుల రాజకీయాల గురించి ముచ్చట్లు పెట్టుకుంటు న్నారన్నారు. విద్య, ఆరోగ్యం వంటి ప్రధానాంశాల గురించి తప్పనిసరిగా చర్చించాల్సి వచ్చినా.. ఆ చర్చలు పైపైనే ఉంటున్నాయన్నారు.

'జనం కోసం జేపీ' సురాజ్య యాత్రలో భాగంగా జయప్రకాష్ నారాయణ్ తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురం మండలంలో పర్యటించారు. వివిధ రంగాలలో గుర్తింపు ఉన్న పౌర ప్రముఖులతో మాట్లాడారు.

రాష్ట్రంలో ఒక్కో విద్యార్థి మీద ప్రభుత్వం ఏటా రూ.60 వేలు ఖర్చు చేస్తున్నట్టు చూపుతోందని, ఇంత డబ్బు ఖర్చవుతున్నా ఫలితాలు అధ్వాన్నంగా ఎందుకున్నాయన్న ప్రశ్న పౌరసమాజం నుంచి ఎందుకు రావడం లేదని జేపీ ప్రశ్నించారు. విద్యారంగాన్ని గాడిలో పెట్టడం మంత్రదండంతోనో, గంభీర ఉపన్యాసాలు, హామీలు, నినాదాలతో సాధ్యంకాదని, అందరూ కలిసొచ్చి నిర్దిష్ట చర్యలు తీసుకుంటేనే విద్యావ్యవస్థను బాగుచేసుకోగలమని అన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మేధావులు, సమాజం సమష్టిగా విద్యను బాగు చేసుకోవాలన్నారు.

తూర్పు గోదావరి జిల్లాలో ఐదుగురి కంటే తక్కువమంది విద్యార్థులున్న పాఠశాలలు 44, 6 నుంచి 10 మంది విద్యార్థులున్న స్కూళ్లు 174 ఉన్నాయని జేపీ తెలిపారు. ఈ లెక్కలన్నిటినీ తాను జిల్లాకు వచ్చి సేకరించానని, ఇందులో పెద్ద గొప్ప రహస్యాలు, విశేషాలు ఏమీ లేవని, చుట్టూ ఉన్న సమస్యలను పట్టించుకునే కనీస బాధ్యత ఉంటే ఇవన్నీ ఇట్టే తెలుస్తాయని అన్నారు. బాలికలపై దాడుల పట్ల జేపీ ఆందోళన వ్యక్తం చేశారు. దాడులకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని, చట్టం సరిగ్గా అమలవుతుంటే విద్యారంగంలో కూడా గణనీయ పురోగతి సాధ్యమవుతుందన్నారు. అందరు బాలికలూ స్కూళ్లకు, పై చదువులకు కూడా వెళ్లగలుగుతారన్నారు. సామాన్యుల బతుకులు బాగుపడటానికి చట్టబద్ధ పాలన, వేగంగా న్యాయం ముఖ్యమన్నారు. ప్రజల సమస్యలపై మీడియా సక్రమంగా స్పందించాలని, ఆకట్టుకునేలా వార్తలను, హేతుబద్ధ పరిష్కారాలను అందించే సామర్థ్యాన్ని ప్రదర్శించాలని కోరారు.

కార్యక్రమాల్లో గుణ్ణం రామకృష్ణ, పి. నరసింహారావు, జేడీ ప్రసాద్, గోలి చిట్టిబాబు, ఎం.సత్యనారాయణ, డీఎస్ఎం శాస్త్రి, జి.వసంత కుమార్, వెంకట్రావు, లోక్‌సత్తా, వైబీఐ నేతలు పాల్గొన్నారు. ○

# మూడేళ్లయినా చట్టబద్ధ పాలన కోసం ఒక్క చర్యా లేదు




కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చి మూడేళ్లవుతున్నా చట్టబద్ధ పాలన అమలుకు ఒక్క చర్య కూడా చేపట్టలేదని జేపీ అన్నారు. చట్టం అందరికీ సమానం కాదని, తమకు న్యాయం జరగదని ప్రజలు భావించటం రాజకీయాలకు, సమాజానికి కూడా మంచిది కాదన్నారు. న్యాయవ్యవస్థ పట్ల విశ్వాసం సన్నగిల్లిన రోజున దేశ సమగ్రతకే ప్రమాదమన్నారు. అందుకే న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని, సామర్థ్యాన్ని కాపాడుకోవాలన్నారు. న్యాయవ్యవస్థను రాజకీయాలకు దూరంగా ఉంచాలన్నారు.

'జనం కోసం జేపీ' సురాజ్య యాత్రలో భాగంగా రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ హాల్‌లో 'న్యాయవాదులతో జేపీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు అంశాలపై ఈ సందర్భంగా జేపీ న్యాయవాదులతో చర్చించారు.

మన న్యాయవ్యవస్థకు ప్రజల్లో ఇంకా నమ్మకం ఉన్నా, ప్రపంచ న్యాయవ్యవస్థలో మాత్రం వెనకబడే ఉన్నామని జేపీ అన్నారు. న్యాయవ్యవస్థను ఉన్నతస్థానానికి తీసుకెళ్లడానికి యువ న్యాయవాదులు సీనియర్ న్యాయవాదుల, న్యాయనిపుణుల సలహాలు, సూచనలు తీసుకుంటుండాలన్నారు. కేసుల విషయంలో కచ్చితమైన కాలపరిమితి ప్రజల హక్కుగా చేయాలన్నారు. ఎగువ కోర్టుల తీర్పులలో ఉన్నత ప్రమాణాలు పాటించాలన్నారు. తమకు న్యాయం జరిగిందని ఫిర్యాదీ సంతృప్తి చెందేలా ఉండాలన్నారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో తీర్పులు మారిపోతున్నాయనే అసంతృప్తి, అనుమానం ప్రజల్లో నెలకొన కూడదన్నారు.

పట్టణీకరణ, సాంకేతికతల నేపథ్యంలో మహిళలపై శారీరకంగా, మానసికంగానూ దాడులు జరుగుతున్నాయని, వీటికి తక్షణం శిక్ష అమలుజరిగేలా వ్యవస్థలో మార్పు రావాలని జేపీ అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలు వేధింపులు, లంచాల బారిన పడకుండా చట్టబద్ధ రక్షణ ఉండాలన్నారు. గతిలేక ఓ సర్టిఫికెట్ కోసం లంచం ఇచ్చే పౌరులకు గరిష్టంగా ఏడేళ్లు జైలు శిక్ష, తప్పు చేసిన ప్రభుత్వాధికారి మీద మాత్రం విచారణకు లోకాయుక్త పర్మిషన్ అంటూ అవినీతి నిరోధక చట్టానికి కేంద్రం ప్రతిపాదించిన సవరణల్ని నిర్ద్వంద్వంగా తిప్పికొట్టాలన్నారు. అలాగే రిజర్వేషన్ల విషయంలో కూడా న్యాయవ్యవస్థలో, సమాజంలో స్పష్టత కావాలన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్‌ల పిల్లలకు రిజర్వేషన్లు అక్కర్లేదన్నారు. ఆయా కులాల్లో కూడా నిజమైన నిరుపేదలకు రిజర్వేషన్లు అమలు జరిగినప్పుడే 'కోటా'కు సార్థకత అన్నారు. కొన్ని రాష్ట్రాల్లో అభివృద్ధి చెందిన కులాలవారు కూడా రిజర్వేషన్లు కోరుతున్నారన్నారు.

ముమ్మారు తక్షణ తలాక్‌తో మహిళలకు విడాకులిచ్చే ఇస్లాం మతాచారం చెల్లదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మానవ హక్కులు, మహిళా స్వేచ్ఛ, హేతుబద్ధ భావాలకు లభించిన గొప్ప విజయమని జేపీ ప్రశంసించారు. విద్య, ఆరోగ్యం, స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు లేకపోవడం, లంచాలు, మహిళలపై వేధింపులు, అప్పుల వ్యవసాయం వీటన్నిటికీ ప్రభుత్వాల విధానాల వైఫల్యమే కారణమని, కేవలం న్యాయవ్యవస్థ అత్యుత్సాహం వల్ల రాజకీయ వైఫల్యాలను పరిష్కరించలేమని అన్నారు. ప్రజల చైతన్యం, చిన్న, పెద్ద విధానపరమైన మార్పులు, సంస్కరణలదే సురాజ్య సాధనలో కీలకపాత్ర అన్నారు.

సీనియర్ న్యాయవాది మద్దూరి శివసుబ్బారావు, తవ్వల వీరేంద్రనాథ్ తదితరులు ప్రసంగించారు. ❍

# పార్టీలకతీతంగా గ్రామాల్ని అభివృద్ధి చేసుకోవాలి




పార్టీ రాజకీయాలకతీతంగా గ్రామాల్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరముందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ అన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో నిర్వహించిన జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా దివాన్‌చెరువు గ్రామంలో ఆయన పర్యటించారు. ఊళ్లో ఉన్న ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాల గురించి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త సూరారపు డేవిడ్‌రాజు ఇంటి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులనుద్దేశించి జేపీ మాట్లాడుతూ.. ఆదాయం, పిల్లలకు చదువు, కుటుంబానికి ఆరోగ్యం గురించి రైతులు పట్టించుకుని అందుకోసం కులాలు, పార్టీలకతీతంగా పోరాడితేనే పరిష్కారం లభిస్తుందన్నారు. కులం కూడుపెట్టదని గుర్తించాలన్నారు. వ్యవసాయాన్ని లాభసాటి చేసుకోవడానికి ఇప్పటికీ మంచి అవకాశాలున్నాయని, పాలకుల విధానాలు మారితే చాలని అన్నారు. ఎలాంటి విధానాలతో మంచి ఆదాయం వస్తుందో రైతులు తెలుసుకుని, వాటిని డిమాండ్లుగా మార్చుకోవాలన్నారు. ఇందుకోసం లోక్‌సత్తా పూర్తి సహాయసహకారాలను అందిస్తుందని, యువరైతులు యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లో నమోదు కావాలని సూచించారు. గ్రామంలో మొబైల్ ఉన్న ప్రజలంతా సిటిజన్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లో చేరి తమ సమస్యల్ని పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ వెబ్ ప్లాట్‌ఫారాలలో సరైన దిశానిర్దేశం, సంఘటిత పోరాటానికి కావలసిన సహచరులు ఉంటారన్నారు.

రుణమాఫీ అందని రైతులకు సంబంధించి సమగ్ర సమాచారం అందిస్తే వారికి న్యాయం చేసేందుకు సహకరిస్తానని ఈ సందర్భంగా కొందరు రైతులకు ఫిర్యాదులపై స్పందిస్తూ జేపీ హామీ ఇచ్చారు. పంచాయతీలో 22ఏళ్లుగా పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్నా తమకు జీతం మాత్రం రూ. 6,700 మాత్రమే వస్తోందని సీఐటీయూ అధ్యక్షుడు బూర అబ్బులు తెలిపారు. ఈ సమస్యపైన, వేపలదిబ్బపై ఇళ్ల స్థలాలపైన కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరించే ప్రయత్నం చేస్తానన్నారు.

గ్రామ పంచాయతీకి ఆదాయవనరులను దృష్టిలో పెట్టుకుని చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో సమావేశమై చర్చించాలని జేపీ సూచించారు. అధికార వికేంద్రీకరణతో స్థానిక సంస్థలను ప్రభుత్వాలుగా గుర్తించకపోవడం పెద్ద సమస్యగా ఉందని, అయినా నిరాశ చెందకుండా మార్పు కోసం పోరాడుతూనే ఉండాలని అన్నారు. తరాలు మారినా పేదల్ని పేదలుగానే కొనసాగిస్తున్న ప్రభుత్వాల విధానాలు మారాలన్నారు.

సమావేశంలో రాజానగరం యాదవసంఘ కన్వీనర్ బత్తుల నాగేశ్వరరావు, మణికంఠకుమార్, మార్గాని చంటిబాబు, సతీష్, మాజీ ఎంపీటీసీ గంగిశెట్టి సోమేశ్వరరావు, అంకం గోపి, కోటేశ్వరరావు, డాక్టర్ చంద్రమౌళి, బండారు రామ్మోహనరావు, ఉప్పలపాటి మాచిరాజు, జగన్నాథరాజు, ఎం. సుబ్రమణ్యం, ఎస్.కుటుంబరావు, కృష్ణమోహన్, రైతులు, వైబీఐ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ❍

# చిన్న పరిష్కారాలతో పెద్ద ఫలితాలను సాధించండి



**చి**న్న పరిష్కారాలతో పెద్ద ఫలితాలను సాధించాలని నిరుద్యోగులకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ యువతకు డా॥ జేపీ సూచించారు. ప్రజలకు వారి పక్కనే, వారి చేతుల్లోనే ఉన్న చిన్న చిన్న పరిష్కారాలను తెలియచేసేందుకే సురాజ్య యాత్రను చేపట్టామన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా రాజమహేంద్రవరం దేవీచౌక్‌లోని శ్రీ విజేత కోచింగ్ సెంటర్లో నిరుద్యోగులు, పార్ట్‌టైమ్ ఉద్యోగులు, తాత్కాలిక హోదాలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న అధ్యాపకులు, పీఎంపీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ యువతతో జయప్రకాష్ నారాయణ్ సమావేశమయ్యారు. వారి సమస్యలను, అభిప్రాయాలను తెలుసుకున్నారు.

అతితక్కువ సంఖ్యలో విద్యార్థులున్నప్పటికీ కేవలం ఎయిడెడ్ హోదా ఉండటం వల్ల కొన్ని విద్యాసంస్థల్లోని అధ్యాపకులు పెద్దజీతాలు పొందుతున్నారని జేపీ అన్నారు. మరోవైపు అధికసంఖ్యలో స్టూడెంట్స్ ఉన్నా కూడా కొన్ని విద్యాసంస్థల్లోని అధ్యాపకులు నామమాత్రపు జీతాలతో నెట్టుకొస్తున్నారన్నారు. ప్రభుత్వం ఈ రెంటినీ సమన్వయం చేసి, విద్యార్థులకు నాణ్యమైన చదువు లక్ష్యంగా పద్ధతులు ఏర్పాటు చేయాలన్నారు. ఎయిడెడ్, ప్రభుత్వ కళాశాలల్లో ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. ఈ కళాశాలలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

దేశంలో ఏటా 1కోటీ 30లక్షల మంది కొత్తగా ఉద్యోగాల మార్కెట్‌లో వచ్చి చేరుతున్నారని, నైపుణ్యాల కోసం ప్రత్యేకమైన శాఖల్ని ఏర్పాటు చేసినా ఫలితం లభించటం లేదని జేపీ అన్నారు. విద్యలోనే నైపుణ్యాల్ని భాగం చేసేలా విద్యాసంస్కరణల్ని తీసుకురావాలన్నారు. ప్రైవేట్ మెడికల్ ప్రాక్టిషనర్ల (పీఎంపీ)ను నైపుణ్యం ప్రాతిపదికన ఆరోగ్య రంగంలో వినియోగించుకుంటే తక్కువ ఖర్చుతో మంచి ఫలితాలొస్తాయన్నారు.

తాత్కాలిక అధ్యాపకులను పర్మినెంట్ చేయాలన్న తమ డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని టెంపరరీ లెక్చరర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డా॥ పీవీబీ సంజీవరావు ఈ సందర్భంగా జేపీని కోరారు.

వక్తృత్వ పోటీలో విజేతలైన విద్యార్థులకు జేపీ చేత బహుమతులను ప్రదానం చేయించారు.

బండారు రామ్మోహనరావు, మాచిరాజు, రాజ్ వర్మ, వైబీఐ ప్రతినిధులు పాల్గొన్నారు. ❍

# బాలికల వసతి గృహాన్ని రాత్రివేళ సందర్శించే ఆనవాయితీ వద్దనుకుని..

**రా**జమహేంద్రవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కనున్న ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహాన్ని సందర్శించాలని తొలుత జేపీ భావించారు. అయితే చీకటిపడటంతో రద్దు చేసుకున్నారు. జేపీ వస్తున్నారనే సమాచారంతో ఏఎస్‌డబ్ల్యువో కె.డేవిడ్‌రాజు, హెచ్‌డబ్ల్యువోలు హాస్టల్ వద్ద సిద్ధంగా ఉన్నారు. రాత్రిపూట బాలికల హాస్టల్ సందర్శనకు వెళ్తే అదే ఒరవడి మరికొందరికి అలవాటుగా మారే అవకాశముందని జేపీ భావించటంతో ఆ కార్యక్రమానికి వెళ్లలేదు. ❍

# వేలమంది ఎంబీబీఎస్ నిరుద్యోగులున్నారు,

## వారి సేవలతో ప్రాథమిక వైద్యాన్ని బలోపేతం చేయండి: జేపీ





రాష్ట్రంలో 30 నుంచి 40వేల మంది ఎంబీబీఎస్ చదివిన నిరుద్యోగులున్నారని, వీరి సేవల్ని సద్వినియోగం చేసే ఆలోచన చేయాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఏపీ ప్రభుత్వానికి సూచించారు. నిబంధనల పేరుతో మెడికల్ ప్రాక్టీస్‌నే కష్టంగా మార్చే ప్రయత్నం చేయవద్దన్నారు. అక్రమాలు జరిగితే సకాలంలో స్పందించే ఏర్పాటుతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు లక్ష్యంగా నిబంధనలు ఉండాలన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా జయప్రకాష్ నారాయణ్ రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మీపతి, డాక్టర్ డీటీ నాయక్, డాక్టర్ జె. పద్మశ్రీ, ఇతర వైద్యులతో సమీక్ష చేశారు. ఆస్పత్రిలో ఎంతమంది వైద్యులున్నారు, రోజూ ఎంత ఓపీ ఉంటోందీ, రోగులకు సౌకర్యాలు, బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులు వంటి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో కలిసి ఆస్పత్రిలోని ఎంసీహెచ్ బ్లాకు, డయాలసిస్ యూనిట్, ఎస్ఎన్‌సీయూలను సందర్శించారు. రోగులతోనూ మాట్లాడారు.

ఎంతో ప్రాధాన్యతగల ఆరోగ్య రంగానికి రాష్టంలో ఒక శాతం నిధులను మాత్రమే కేటాయించడం దురదృష్టకరమని జేపీ అన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఒక బెడ్‌కు ఏడాదికి రూ. 10-15లక్షల ఖర్చు చేస్తున్నారని, కొన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో బెడ్‌కు రూ. 1కోటి కూడా వెచ్చిస్తున్నారని, కానీ ప్రభుత్వాస్పత్రుల్లో కేవలం రూ. 3.6 లక్షల వరకు మాత్రమే ఖర్చు చేస్తున్నారని అన్నారు. ఇది ప్రజల పట్ల దారుణంగా ప్రభుత్వాలు వ్యవహరించడమేనన్నారు.

ప్రస్తుతం జిల్లా ఆస్పత్రులు, టీచింగ్ ఆస్పత్రుల్లోనూ కొంతమేరకు మంచి వైద్యం అందుతోందని, కానీ పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో మంచి వైద్యం అందితేనే అందరికీ నాణ్యమైన వైద్యం సాధ్యమవుతుందని జేపీ అన్నారు. దిగువ స్థాయి ఆస్పత్రుల్లో వైద్యం మొక్కుబడి కావడంతో పెద్దాస్పత్రుల మీద భారం పెరుగుతూ నాణ్యత తగ్గుతోందన్నారు. విషజ్వరం వచ్చినా జిల్లా, టీచింగ్ ఆస్పత్రుల వద్దకు పరుగులు పెట్టాల్సి వస్తోందన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో 250 పడకల సామర్థ్యం ఉంటే రోగుల ఆక్యుపెన్సీ 400 వరకు ఉంటోందని, పైస్థాయి ఆస్పత్రులపై ఒత్తిడి ఎక్కువగా ఉందనేందుకు ఇదే నిదర్శనమని అన్నారు. ప్రాథమిక స్థాయిలోనే మంచి వైద్యం అందించగలిగే రోజులు వస్తేనే ఆరోగ్య రంగం ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు.

ఎంబీబీఎస్ వైద్యుల సేవలను ప్రాథమిక స్థాయిలో వినియోగించుకునేలా ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ రావాలని జేపీ అన్నారు. జిల్లా, బోధనాస్పత్రులు రిఫరల్ కేసులకు మాత్రమే పరిమితం కావాలన్నారు.

# గ్రామాలకు ఇస్తున్నది 5 పైసల కంటే తక్కువ!



ఈ వేళ్టి తరానికి 5పైసల నాణెం గురించి కూడా తెలిసుండకపోవచ్చుని, అయితే ప్రభుత్వాలు గ్రామాలకు ఇస్తున్నది రూపాయికి 5 పైసల కంటే కూడా తక్కువని జేపీ అన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా రాజమహేంద్రవరంలో యువత, మధ్యతరగతి ప్రజల సమస్యలపై ఆయా వర్గాలతో జేపీ చర్చించారు.

కేంద్రప్రభుత్వం రూ. 100లను పన్నుల రూపంలో సమీకరిస్తే, అందులో రూ. 51 రాష్ట్రాలకు ఇస్తోందని, రాష్ట్రాల నుంచి మండలానికి రూ. 8 వస్తుండగా, గ్రామాలకు వచ్చేసరికి అది రూ. 4 అవుతోందని జేపీ వివరించారు. అంటే గ్రామాలకు రూపాయిలో ఐదు పైసలు కూడా దక్కడం లేదన్నారు. రాష్ట్రంలో, దేశంలో ప్రజలు ఎక్కువగా ఉండేది గ్రామాల్లోనేనని, అలాంటి గ్రామాల్లో రోజువారీ పనుల కోసం ముఖ్యమంత్రిని, మంత్రులను, ప్రధానమంత్రిని దేబిరించాల్సిన పరిస్థితిని ఏర్పరిచారన్నారు. చిన్న చిన్న సమస్యల కోసం కూడా నిధులు, అధికారాలు లేక స్థానిక ప్రజలు కష్టాలు పడే సమాజంలో లంచాలు, వేధింపులు, దేబిరింపులే రాజ్యమేలతాయని, దీన్ని మారిస్తేనే సురాజ్యం సాధ్యమవుతుందని అన్నారు. సురాజ్య వ్యవస్థలో ప్రభుత్వానికి–ప్రజలకు మధ్య గోడలుండవని, ప్రజలు స్వేచ్ఛగా తమ డిమాండ్లను సాధించుకుంటూ ఎదగగలుగుతారని అన్నారు. మంచి విద్య, నాణ్యమైన ఆరోగ్యం, ఉన్న ఊరి చుట్టుపక్కలే ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ప్రజలకు పాలన గురించి తెలియనీయకుండా ఎన్నికల్లో ఓటు వేసే యంత్రాలుగా కొనసాగించే ఎత్తుగడలో భాగంగానే స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు లేకుండా చేస్తున్నారన్నారు.

కేంద్ర ప్రభుత్వం జిల్లా పరిషత్‌లకు నిధులివ్వడంలేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫిర్యాదు చేస్తోందని, కేంద్రం గ్రామ పంచాయతీలకు విడుదల చేసిన నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అడ్డుకుంటోందని జేపీ ప్రశ్నించారు. కేంద్ర నిధుల సంగతి అలా వుంచితే.. అసలు రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పైసా అయినా పంచాయతీలకు ఇస్తోందా? వీటిపై ప్రజలకు వివరాలు చెప్పండి అని డిమాండ్ చేశారు.

చుట్టూ జరుగుతున్న సమస్యల గురించి కాస్త పరిజ్ఞానాన్ని పెంచుకుని, హేతుబద్ధంగా ఆలోచించగలిగితే స్పష్టమైన పరిష్కారాలున్నాయని, వాటిని అందించేందుకే సురాజ్య యాత్ర చేస్తూ ప్రజలను చైతన్య పరుస్తున్నామని జేపీ వివరించారు. చైతన్యవంతులైన పౌరులు సంఘటితంగా పోరాడేందుకు యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్ వేదికలను ఏర్పాటు చేశామని, వాటి ద్వారా పరిష్కారాలను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ❍

# ప్రభుత్వాలే ఆటస్థలాలను లాక్కోవడం తగదు




ఆరోగ్యాన్ని, శరీర దారుఢ్యాన్ని, సమష్టి స్ఫూర్తిని పెంపొందించటంలో క్రీడలది ప్రముఖ పాత్రని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ అన్నారు. ఓపక్క అంతర్జాతీయ, జాతీయ పతకాలు సాధించిన క్రీడాకారులకు సొంత సొమ్ము దానం చేసినట్టు కోట్ల రూపాయల నగదు, ఇళ్ల స్థలాలను ఇస్తూ, మరోపక్క కోట్లాదిమంది పిల్లలు, యువతకు ఉపయోగపడే క్రీడామైదానాలు, వసతుల్ని పాలకులు నిర్లక్ష్యం చేయటం తగదన్నారు. తెలుగునాట ఆటల్ని ప్రోత్సహించాల్సిన ముఖ్యమంత్రే.. ఆటస్థలాలెందుకు, వాటిలో ఎవరైనా ఆడుతున్నారా, పాడా? అంటూ ఇతర నిర్మాణాలకు వాటిని లాగేసుకోవాలని ప్రయత్నించటం విచిత్రంగా ఉందన్నారు.

తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువు గ్రామంలోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ పాఠశాలలో సీబీఎస్ఈ-న్యూఢిల్లీ నిర్వహిస్తున్న క్లస్టర్ 7 ఖోఖో-2017 పోటీలను జ్యోతి వెలిగించి జేపీ ప్రారంభించారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సీబీఎస్ఈ పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా నన్నయ, ప్రకాశం పంతులు వంటి మహనీయులు నడయాడిన నేల మీద ఈ కార్యక్రమంలో పాల్గనటం ఆనందంగా ఉందని జేపీ అన్నారు. క్రీడలు మనుషుల మధ్య అడ్డుగోడలను తొలగిస్తాయన్నారు. వ్యక్తిగత కీర్తి కోసం కాకుండా సమష్టిగా పోరాడి విజయం సాధించాలని అన్నారు. అంతిమంగా, ఆటల్లో పాల్గన్నవారందరినీ విజేతలుగా పరిగణించాలన్నారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలని, పట్టణ, నగర ప్రాంతాలలో లంగ్ స్పేస్‌లలా క్రీడామైదానాలను అభివృద్ధి చేయాలని అన్నారు.

శ్రీప్రకాష్ విద్యాసంస్థల సహాయ కార్యదర్శి సీహెచ్ విజయప్రకాష్ మాట్లాడుతూ, ఈ పోటీల్లో పాల్గనేందుకు ఏపీ, తెలంగాణల నుంచి 750మంది క్రీడాకారులు వచ్చారన్నారు. అండర్-17, అండర్-19 విభాగాలలో బాలురు, బాలికలకు వేర్వేరుగా పోటీలు ఏర్పాటుచేశామన్నారు. సీబీఎస్ఈ తరపున క్రీడా పోటీలకు పరిశీలకుడిగా అంతర్జాతీయ వాలీబాల్ కోచ్ ఇయాజ్ షమీమ్ హాజరయ్యారు. కార్యక్రమంలో విద్యాసంస్థల సీనియర్ ప్రిన్సిపల్ ఎంవీవీఎస్ మూర్తి, ప్రిన్సిపల్ ఏఎస్ఎన్ మూర్తి, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, రామ్మోహనరావు, మాచిరాజు, డాక్టర్ చంద్రమౌళి, ఎస్ఎస్ఆర్ జగన్నాథరాజు, జగన్నాథరావు, రాజశేఖరవర్మ తదితరులు పాల్గొన్నారు. ❍

# అవినీతి అంటని వర్గం ఉపాధ్యాయులే

పాఠశాల చదువుల తీరును గణనీయంగా ప్రక్షాళన చేయాలని శ్రీప్రకాష్ పాఠశాల క్యాంపస్‌లో ఉపాధ్యాయులతో, మీడియాతో మాట్లాడుతూ జేపీ అన్నారు. కొన్ని ప్రైవేటు, సీబీఎస్ఈ సిలబస్ స్కూళ్లు ఏడాదికి రూ.30వేల ఫీజుతోనే మంచి ఫలితాలను సాధిస్తున్నాయని, తెలంగాణలో గురుకుల సంక్షేమ స్కూళ్లలో విద్యార్థికి రూ.40వేల చొప్పున ఖర్చు చేస్తూ పిల్లల్ని మెరికల్లా మారుస్తున్నారని.. కానీ ఏపీలో ఏడాదికి ఒక్కో విద్యార్థి మీద రూ.60వేలు ఖర్చు చేస్తున్నా ఫలితాలు రావడం లేదని అన్నారు. పాఠశాల చదువుల తీరు మారితేనే యువతకు సరైన భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రస్తుత సమాజంలో అవినీతి అంటని వర్గం ఉపాధ్యాయులేనని, వారు ట్రేడ్ యూనియన్ రాజకీయాలలో మునిగితేలకుండా విద్యావ్యవస్థ ప్రక్షాళనకు బాధ్యత తీసుకోవాలని కోరారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, నిరుద్యోగ భృతి వంటి పథకాలను ఉద్యోగాలకు ప్రత్యామ్నాయంగా చూపటం యువతను మోసం చేయటమేనని, అవి తాత్కాలిక ఉపశమనాలేనని జేపీ అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం రూపకల్పన సమయంలో తాను జాతీయ సలహా మండలి (ఎన్ఏసీ)లో ఉన్నానని, ఆ పథకాన్ని మంచి నీటి, ఆదాయవనరులున్న గోదావరి జిల్లాలు వంటి ప్రాంతాల్లో అమలుచేయవద్దని, బదులుగా ఉద్యోగావకాశాలు పెంచేందుకు కృషిచేయాలని ఎన్ఏసీ ఛైర్మన్ సోనియా గాంధీకి సూచించానని తెలిపారు. కానీ ఓట్ల రాజకీయం కోసం అసమర్థ నేతలు ఆ విఫల పథకాన్ని కొనసాగిస్తున్నారన్నారు. నైపుణ్యాలనిచ్చే నాణ్యమైన చదువు, ఉపాధి అవకాశాలతోనే యువభారత్ అభివృద్ధి చెందగలదన్నారు. ❍



ప్రతి గ్రామం అభివృద్ధిలో ప్రజలు, యువత ఎలా భాగస్వాములవ్వాలో ఆముదాలబంద మార్గదర్శనం చేస్తోందని జేపీ అన్నారు. ఈ గిరిజన గ్రామంలో యువత, మిగిలిన గిరిజనులు చేస్తున్న సమష్టి కృషి అభినందనీయమన్నారు.

జనహితం కోసం సురాజ్య యాత్రలో భాగంగా జేపీ తూర్పు గోదావరి మన్యంలోని ఆమదాలబంద గిరిజన గ్రామాన్ని సందర్శించారు. అక్కడ గిరిజనులు, నవభారత్ నిర్మాణ్ వలంటీర్లతో అక్కడి పరిస్థితుల మీద

# ఆముదాలబంద గిరిజన యువత సమష్టి కృషి భేష్!

చర్చించారు. వారి జీవనశైలి, పంటలు, ఆదాయ వనరులు, ఆరోగ్యం, విద్యకు అవకాశాల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నిధుల గురించి గ్రామ కార్యదర్శి, సర్పంచ్‌ని వివరాలడిగారు. ప్రభుత్వ పథకాల అమలుతీరును అక్కడికి వచ్చినవారందరినీ అడిగి తెలుసుకున్నారు. సమస్యలు, పరిష్కారాలపై వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ సూచనలిచ్చారు. తర్వాత ఆముదాలబంద గ్రామంలో పర్యటించారు.

సర్పంచ్ నీలాద్రి లక్ష్మి, మాజీ సర్పంచ్ కుంజం వెంకటేశ్వర్లు దొర మాట్లాడుతూ, గ్రామానికి సరైన రహదారి సౌకర్యం ఇప్పటికీ కల్పించలేదని, 14వ ఆర్థిక సంఘం నిధులు తప్పితే పంచాయతీకి మరే ఇతర నిధులనూ ఇవ్వడం లేదని అన్నారు. భూపతిపాలెం కెనాల్ ఉన్నప్పటికీ సాగునీరు అందడం లేదని సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తుంటే తమను పూచికపుల్లల్లా తీసిపారేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండుసార్లు జన్మభూమి కార్యక్రమాలను బహిష్కరించినా ప్రభుత్వంలో కదలిక లేదన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధిపై అధికారులకు, పాలకులకు ఏపాటి శ్రద్ధ ఉందో అర్థమవుతోందని జేపీ అన్నారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాలకు గిరిజన సబ్‌ప్లాన్ (టీఎస్‌పీ) నిధులు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. ఉపాధి నిధులను ఎక్కువగా వినియోగించి గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్నారు. అవసరమయ్యే నిధుల కోసం యువత పోరాటం చేయాలని, ఇది పూర్తిగా చట్టబద్ధ హక్కని అన్నారు. గ్రామంలో

*గ్రామాభివృద్ధి కార్యక్రమాలకు గిరిజన సబ్‌ప్లాన్ (టీఎస్‌పీ) నిధులు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. ఉపాధి నిధులను ఎక్కువగా వినియోగించి గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్నారు. అవసరమయ్యే నిధుల కోసం యువత పోరాటం చేయాలని, ఇది పూర్తిగా చట్టబద్ధ హక్కని అన్నారు. గ్రామంలో నాటుసారా తయారీ, అమ్మకాలు లేకపోవడం, వ్యక్తిగత మరుగుదొడ్లు పూర్తిచేయడం అభినందనీయమన్నారు. సరైన విధానాలు, ప్రణాళిక ఉంటే ఉన్న వనరులతోనే గ్రామాభివృద్ధి చేయవచ్చన్నారు.*

నాటుసారా తయారీ, అమ్మకాలు లేకపోవడం, వ్యక్తిగత మరుగుదొడ్లు పూర్తిచేయడం అభినందనీయమన్నారు. సరైన విధానాలు, ప్రణాళిక ఉంటే ఉన్న వనరులతోనే గ్రామాభివృద్ధి చేయవచ్చన్నారు. టీఎస్‌పీ నిధులు, ప్రాథమ్యాల గురించి కూడా అవగాహన పెంచుకోవాలని, యువత చదువుపై గట్టిగా దృష్టి పెట్టి మంచి ఆదాయావకాశాలున్న రంగాల్లో స్థిరపడాలన్నారు. గ్రామం నుంచి సుమారు పదిమంది ప్రభుత్వోద్యోగులుండటం ప్రశంసనీయమన్నారు. మంచి విద్య, ఆరోగ్యం ఉంటే ప్రపంచంలో ఎవరికీ ఆముదాలబంద గ్రామస్తులు తీసిపోరన్నారు. గ్రామాభివృద్ధికి సహకరించాలని నవభారత్ నిర్మాణ్ వలంటీర్లను జేపీ కోరారు.

కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రసాద్, బండారు రామ్మోహనరావు, మాచిరాజు, మూర్తి, జగన్నాథరాజు, డాక్టర్ మధు తదితరులు పాల్గొన్నారు. ○

# ఒక్కో పీహెచ్‌సీకి రూ.2కోట్లు ఇస్తే చాలు

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో చేపట్టిన ఆరు అంశాలలో ఐదింటికి ఒక్క రూపాయి కూడా అదనంగా కేటా యించాల్సిన పనిలేదని, కేవలం విధానపరమైన మార్పులు చేస్తేచాలని, వైద్య రంగంలోనే కొన్ని అదనపు కేటాయింపులు జరపాలని జేపీ అన్నారు.




సురాజ్య యాత్రలో భాగంగా జేపీ తూర్పు గోదావరి మన్యం ప్రాంతంలోని పిడతమామిడి, గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు.

ఆంధ్రప్రదేశ్‌లోని పీహెచ్‌సీలు ఒక్కోదానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 90లక్షల దాకా కేటాయింపు చూపుతోందని, ఈ మొత్తాన్ని రూ. 2కోట్లకు పెంచి సరైన పద్ధతి, పర్యవేక్షణతో అమలు చేస్తే ప్రజలకు మంచి ఆరోగ్యం అందుతుందని జేపీ అన్నారు. రాష్ట్రంలోని చాలా పీహెచ్‌సీల నిర్వహణ బాధ్యతారహితంగా, అరకొర వసతులతో ఉందన్నారు. సరైన జీతభత్యాలు కూడా లేకపోవడంతో ప్రభుత్వ వైద్యసేవలకు డాక్టర్లు సుముఖంగా లేరన్నారు. ప్రజల ఆరోగ్యం కంటే ప్రభుత్వానికి ముఖ్యమైన ఎజెండా ఉందా? అని ప్రశ్నించారు. అందరికీ ఆరోగ్యం అందించటంలో కీలకమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయాలన్నారు. దీనివల్ల పైస్థాయి ఆసుపత్రుల మీద భారం తగ్గుతుందని, ప్రజలకు కూడా రోగాల బారిన పడకుండా సంతోషంగా బతకగలుగుతారని అన్నారు. బ్రిటన్ తరహాలో ప్రజలు తమకు నచ్చిన వైద్యుల వద్ద పేరు నమోదు చేసుకుని అవసరమైనప్పుడు వైద్యసేవలు పొందే విధానముంటే, ప్రజలకు భారం లేకుండానే వైద్యులకు మంచి ఆదాయం లభిస్తుందన్నారు. బ్రిటన్‌లోని నేషనల్ హెల్త్ కేర్ పద్ధతిలో కనీసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నిర్వహించినా జనానికి ఖర్చు లేకుండా మంచి ఆరోగ్యం అందుతుందన్నారు. కేవలం ఆరోగ్య ఖర్చుల వల్లే ఓపక్క ప్రజలు పేదలవుతుంటే, పేదరిక నిర్మూలన చేస్తున్నామని తాత్కాలిక పథకాలతో ప్రభుత్వాలు చాటుకోవటం హాస్యాస్పద మన్నారు.

పిడతమామిడి, గంగవరం పీహెచ్‌సీలలో రోగులు, వైద్యులతో జేపీ మాట్లాడారు. మౌలిక సదుపాయాలు, మందుల నిల్వ, సిబ్బంది సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. మలేరియా కేసులు, నియంత్రణా చర్యలపై రికార్డులను పరిశీలించారు.

తాను ఇంతవరకూ సందర్శించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పిడతమామిడి, గంగవరం మెరుగ్గా ఉన్నాయని జేపీ ప్రశంసించారు. వసతులు అరకొరగా ఉన్నా సిబ్బంది కష్టపడి పనిచేస్తున్నారని, ప్రభుత్వం గనక సరైన పద్ధతిలో, కాస్త అదనపు నిధుల్ని కేటాయిస్తే ఇక్కడ మంచి వైద్యం అందుబాటులోకి వస్తుందని అన్నారు. ఏజెన్సీలోని అన్ని పీహెచ్‌సీలకు కలిపి ఇద్దరే రెగ్యులర్ డాక్టర్లు ఉండటం ఆశ్చర్యంగా ఉందని, వెంటనే రెగ్యులర్ వైద్యులను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా పీహెచ్‌సీల పరిధిలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు తమ సమస్యల్ని జేపీ దృష్టికి తీసుకొచ్చారు. తమకు చాలీచాలని జీతాలనిస్తున్నా రన్నారు. దీనిపై స్పందిస్తూ.. ఒకేస్థాయి సిబ్బందికి రెండు రకాలుగా వేతనాలు చెల్లించడం తగదన్నారు. ఏటా రూ. 3,000కోట్లు ఖర్చు చేస్తే ఏపీలోని ఆరోగ్య రంగం సమర్థవంతంగా, ప్రజాప్రయోజనకరంగా మారు తుందన్నారు.

కార్యక్రమంలో తహసీల్దార్ చిన్నారావు, పీహెచ్‌సీ వైద్యులు భవానీ శంకర్, విల్సన్, ఆర్ఐ చిరంజీవి బాబు, వైద్యసిబ్బంది, లోక్‌సత్తా, వైబీఐ ప్రతినిధులు పాల్గొన్నారు. ❍

# ప్రభుత్వ పాఠశాలల బలహీనతే.. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల బలం




ప్రభుత్వ పాఠశాలల బలహీనతే ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల బలమని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. అధ్వాన్నంగా ఉన్న ప్రభుత్వ స్కూళ్లలో పేదలు, బడుగు బలహీనవర్గాలు వారే ఇప్పుడు ఎక్కువగా చదువుకుంటున్నారని, మంచి చదువు ఎందుకివ్వటంలేదని కనీసం వారిలో అడిగేవారు లేకపోవడంతో పాలకులు, అధికారులది ఆడింది ఆట, పాడింది పాటగా మారిందని అన్నారు. ఈ పరిస్థితుల్లో ఏం చేయాలో తోచక పలువురు నిరుపేదలు సైతం అప్పులు చేసి మరీ ప్రైవేటు స్కూళ్లకు పంపుతున్నారన్నారు. అక్కడా మంచి చదువు అందుతున్న దాఖలాలు లేవన్నారు. ఏపీలో ఏటా ఒక్కో విద్యార్థి మీదా రూ.60,000 ఖర్చు చేస్తున్నా చదువెందుకు రావటం లేదని ముఖ్యమంత్రి, మంత్రులు సమీక్షించిన దాఖలాలు లేవన్నారు. ఆర్థికమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న తుని నియోజకవర్గంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 650మంది విద్యార్థులకు 6గురు మాత్రమే అధ్యాపకులు ఉన్నారని, మరోవైపు కడప జిల్లా మైదుకూరులోని డిగ్రీ కళాశాలలో 50 మంది విద్యార్థులకు 13 మంది లెక్చరర్లు ఉన్నారని.. విద్య పట్ల ఎంత నిర్లక్ష్యం రాజ్యమేలుతోందో, ప్రజల డబ్బు ఎలా ఎడాపెడా దుర్వినియోగ మవుతోందో ఇంతకంటే నిదర్శనం అక్కర్లేదని అన్నారు. ఇంత చిన్న సమస్యను కూడా పరిష్కరించలేని స్థితిలో ప్రభుత్వముండటం దౌర్భాగ్యమన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా కాకినాడలో జేపీ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తే, బడుగు బలహీనవర్గాలు, పేదలు బాగుపడటానికి మంచి మార్గం ఏర్పడుతుందన్నారు. సర్కారీ బడులను బలోపేతం చేయటంతోపాటు ప్రతి బిడ్డకూ మంచి విద్యనందించేందుకు స్పష్టమైన విధానం, జవాబుదారీతనంతో కూడిన వికేంద్రీకరణ, స్థానిక ప్రభుత్వాల బలోపేతం అవసరమన్నారు. ఈ మౌలిక సమస్యలపై ప్రజలతో చర్చించేందుకు, పరిష్కారాలను అందించేందుకే తాను సురాజ్య యాత్రను చేపట్టానన్నారు. ఇందులో తాను గొంతెమ్మ డిమాండ్లు చేయటంలేదని, ప్రజలకు అత్యంత అవసరమైన, వారి జీవితాల్ని మార్చగలిగిన, ఏ పార్టీకీ అభ్యంతరం ఉండాల్సిన అవసరంలేని, వెంటనే అమలు చేయగలిగిన పరిష్కారాలనే అమలుచేయాలని జనాన్ని చైతన్య పరుస్తూ అడుగుతున్నానని అన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో 100 రోజులపాటు సురాజ్య యాత్ర సాగుతుందన్నారు. ❍

# ఉపాధ్యాయులూ కలిసి రండి

ప్రతి బిడ్డకూ మంచి చదువునందించేందుకు, అవినీతి లేని సమాజాన్ని నిర్మించేందుకు ఉపాధ్యాయులు ముఖ్యమైన తోడ్పాటునందించాలని జేపీ కోరారు. కాకినాడలోని సాంబమూర్తినగర్ గాంధీభవన్‌లో సురాజ్య యాత్రలో భాగంగా ఆయన ఉపాధ్యాయ సంఘాలతో సమావేశమయ్యారు. సామాజికవేత్తలు కూడా పాల్గొన్నారు.

ప్రజల్లో అత్యధికుల పిల్లలకు అందే చదువులో నాణ్యత తగ్గిపోతుండటంతోపాటు, సమాజంలో అవినీతి రోజురోజుకూ కొత్తపుంతలతో పేరుకుపోతోందని జేపీ అన్నారు. దీన్ని రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని, ఉపాధ్యాయులు సూత్రధారులుగా వ్యవహరించాలని కోరారు. సమావేశంలో పాల్గొన్న పలువురు ఉపాధ్యాయులు ఈ సమస్యలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. వాటిని జేపీ శ్రద్ధగా ఆలకించి నమోదు చేసుకున్నారు. విద్యాప్రమాణాల పెంపునకు, ప్రభుత్వ కార్యాలయాల్లో పౌరసేవలను లంచాలు లేకుండా అందించేందుకు ప్రభుత్వాలకు లోక్‌సత్తా సమర్పించిన ప్రతిపాదనలు, పౌర సేవల చట్టం అమలుచేయాల్సిన అవసరం ఉందని పలువురు ఉపాధ్యాయులు, సామాజికవేత్తలు అభిప్రాయపడ్డారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు సీహెచ్ ప్రదీప్‌కుమార్, పీఎన్‌వీవీ సత్యనారాయణ, టి.వెంకట్రావు, సలాది సుధాకర్, కృష్ణంరాజు, టీవీఎస్ రంగారావు, కేసరి శ్రీనివాసరావు, నీలం వెంకటేశ్వరరావు, పల్లంరాజు, లోక్‌సత్తా ఉద్యమ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కన్వీనర్ బండారు రామ్మోహనరావు, ఇతర నేతలు పాల్గొన్నారు. ❍

ఒక్క అసెంబ్లీ నియోజకవర్గంలో ఓట్లు అమ్మేవారిని, కొనేవారిని జైల్లో పెట్టాలనుకుంటే దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్న జైళ్లన్నీ కూడా చాలవని జేపీ అన్నారు. ఒక్క పార్లమెంటు నియోజకవర్గంలో ఓట్లు అమ్మేవారిని, కొనేవారిని జైల్లో పెట్టాలనుకుంటే దేశం మొత్తంలోని జైళ్లన్నీ కూడా చాలవన్నారు. మనం ఈ వాస్తవాల్ని వదిలేసి, ఎన్నికల సంఘం ఏం చేస్తోంది, ఎన్నికల కమిషనర్ ఎందుకు చర్యలు



# దక్షిణాది జైళ్లన్నీ కలిపినా చాలవు

తీసుకోలేకపోతున్నారు అని హైరానా పడిపోతున్నామన్నారు. ఎన్నికల సమయంలో మీడియా సమావేశాల్లో కెమేరాలు, పత్రికల్లో పతాకశీర్షికలు వచ్చేసరికి ఎన్నికల అధికారులు హీరోలు అయిపోరని గుర్తించాలన్నారు. ఎన్నికల సంఘం చేయాల్సిన కొన్ని పనులు సక్రమంగా చేయని మాట నిజమేగానీ, ఎన్నికల సంస్కరణల భారాన్నంతా ఆ రాజ్యాంగ సంస్థ మీద మోపకూడదన్నారు. అవిద్య, పేదరికం, సంక్లిష్ట భిన్నత్వం ఉన్న దేశంలో చాలా జాగ్రత్తగా ఎన్నికల సంస్కరణల్ని రూపొందించాలన్నారు. నంద్యాల అసెంబ్లీ ఉప ఎన్నికలో ఓట్ల కొనుగోలుకు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేశారన్న వార్తలపై రాజమండ్రిలో మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు జేపీ పైవిధంగా సమాధానమిచ్చారు. తాను ప్రస్తుతం చేస్తున్న సురాజ్య యాత్రలో ప్రజలు ఎదుర్కొంటున్న ఆరు మౌలిక సమస్యలపై తక్షణం అమలు చేయగల పరిష్కారాలను వారితో చర్చించి సాధించే లక్ష్యంతో ఉన్నానని, ఎన్నికల సంస్కరణలు వంటి అంశాల గురించి మరోసారి మాట్లాడదామని అన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్ర రాజమండ్రి చేరిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గోదావరి నదిని కృష్ణాతోపాటు మహానదితో కూడా అనుసంధానం చేయాలన్నారు. ఇందుకోసం ఒడిషా ప్రభుత్వంతో చర్చలు జరపాలన్నారు. పోలవరంపై వెంటనే స్పందించాలని లోక్‌సత్తా ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తోందని, ఏపీ ప్రభుత్వం ఆలస్యంగా స్పందించిందని అన్నారు. ఇది అంతర్రాష్ట్ర బహుళార్థ ప్రాజెక్టని, దీని వల్ల ఏపీలో డెల్టా భూములకు సాగువసతి స్థిరీకరణ, రాయలసీమకు సాగునీరు, ఉత్తరాంధ్రకు నీటి వనరు సాధ్యమవటంతోపాటు, తెలంగాణ మెట్ట ప్రాంతాలకు, మహారాష్ట్ర, కర్ణాటకలకు కూడా లబ్ధి చేకూరుతుందన్నారు. అన్ని నదులనూ అనుసంధానం చేయటం వల్ల లాభం ఉండదని, గోదావరి-కృష్ణా-మహానది-పెన్నా అనుసంధానం లాభదాయకమన్నారు. రైతులకు నీటి వసతి ఒక్కటే సరిపోదని, సరైన మార్కెటింగ్ సదుపాయాల్ని, దళారీలేని అమ్మకపు విధానాల్ని ఏర్పాటు చేయాలన్నారు.

ఏపీలో ఏటా రూ.500 కోట్ల మార్కెట్ సెస్సును రైతుల నుంచి వసూలు చేస్తున్నా అందులో 10శాతం కూడా వారి కోసం మార్కెట్ కమిటీలు ఖర్చు చేయటం లేదని జేపీ అన్నారు. రైతులకు తేలిగ్గా ప్లెడ్జిరుణాలిచ్చే రైతుబంధు పథకం ద్వారా ఎన్ని రుణాలిచ్చారో చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం ప్రకటించాలన్నారు. రుణమాఫీలు వంటి పథకాల ద్వారా రైతులనుంచి ఓట్లు కొల్లగొట్టటం పట్ల చూపుతున్న ఆసక్తి.. వారికి తేలిగ్గా రుణాలు, న్యాయమైన ధర అందించటంలో ప్రభుత్వాలు చూపటంలేదన్నారు. కేవలం పాలకుల విధానాల వల్లే రైతులు ఎక్కువగా నష్టపోతున్నారన్నారు. వీటిని సరిచేసి రైతులు తలెత్తుకుని బతికేలా వారి పంటల ద్వారానే వారికి ఆదాయాన్నివ్వటం పూర్తిగా సాధ్యమన్నారు. వాటిని తెలియచేసేందుకు, రైతుల అభిప్రాయాలను తెలుసుకుని అవసరమైన ఇతర పరిష్కారాలను అందించేందుకే సురాజ్య యాత్రను చేపట్టామన్నారు. దాంతోపాటు రైతులకుటుంబాలకు మంచి వైద్యం, బిడ్డలకు మంచి విద్య అందించేందుకు కూడా ఈ యాత్ర ద్వారా కృషి చేస్తున్నామన్నారు. యువ రైతులు 'యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్'లో నమోదై తమ సమస్యల్ని సరైన విధానాలతో పరిష్కరించుకోవచ్చన్నారు. మిగిలినవారు 'సిటిజన్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్'లో చేరి పనిచేసుకోవచ్చన్నారు.

కార్యక్రమంలో బండారు రామ్మోహనరావు, మాచిరాజు, డాక్టర్ రాధాకృష్ణమూర్తి, ఎం.వి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ❍

# రాజకీయాల్ని మాత్రం అప్‌డేట్ చేసుకోలేకపోతున్నామెందుకు?

టెక్నాలజీ ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతోందని, కానీ వ్యవస్థ మాత్రం ఇంకా పాతకాలంనాటిదే నడుస్తోందని జేపీ అన్నారు. సాంకేతికతకు తగ్గట్టుగా పురోగమించకపోగా కొన్ని రంగాల్లో తిరోగమిస్తోందన్నారు. వ్యవస్థను అప్‌డేట్ చేయాల్సిన బాధ్యతను సామాన్యులు, రెక్కాడితే డొక్కడని వారి మీద వేయటం న్యాయం కాదని, పట్టభద్రులు, కాస్త వనరులు ఉన్నవారే ఈ పని చేయాలని అన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా తూర్పు గోదావరి జిల్లాలో వివిధ వర్గాలతో జేపీ మాట్లాడారు. వారి అభిప్రాయాలను తెలుసుకుంటూనే తదనుగుణంగా పరిష్కారాలను అందించారు. కార్యాచరణను సూచించారు. విద్యపై ఉపాధ్యాయులతో సుదీర్ఘంగా చర్చించారు. రామ్‌కోసాలో డాక్టర్లతో సమావేశమయ్యారు.

క్షేత్రస్థాయిలో లోపాలను సరిదిద్దుకోవడానికి ఏ ప్రభుత్వం ప్రయత్నించటం లేదని, ఇందుకు అన్ని రంగాల్లో అవినీతి వేళ్లూనుకోవడం ప్రధాన కారణమని జేపీ అన్నారు. కొంతమంది టీచర్ ఎమ్మెల్సీల వల్ల ఉపాధ్యాయుల్లో గ్రూపులు ఏర్పడుతున్నాయని, ఇది విద్యారంగంపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు.

ప్రజాస్వామ్యం సంక్లిష్టమైనదని, చాలా ఒడుపుగా, అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యముండేలా విధానాలను రూపొందించించాల్సి ఉందని జేపీ అన్నారు. కులవ్యవస్థను పూర్తిగా సమసిపోయేలా చేయాలన్నారు. కార్పొరేట్ దోపిడీ విధానానికి అవకాశం లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. విద్య, ఆరోగ్యం, నిరుద్యోగం, కులవివక్ష, రిజర్వేషన్ల ఘర్షణ, మహిళలపై వేధింపులు, లంచాలు, అప్పుల వ్యవసాయం, రిజిస్ట్రేషన్ చట్టాలు.. ఈ అంశాలపై ప్రజలు, ముఖ్యంగా ఆలోచనాపరులు దృష్టి పెడితే అందరి జీవితాలూ మెరుగవుతాయన్నారు. ❍



## ప్రతి ఒక్కరూ ఐదు నుంచి పది మొక్కలు నాటాలి: జేపీ

పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జేపీ అన్నారు. కాకినాడలోని కమల్‌వీర్ జంక్షన్‌లో ఆల్‌విజ్ సంస్థ ఏర్పాటు చేసిన మొక్కల పెంపకం కార్యక్రమంలో 'సురాజ్య యాత్ర'లో భాగంగా ఆయన పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఐదు నుంచి పది మొక్కలను నాటాలని జేపీ కోరారు. ఆడంబరాల్ని తగ్గించుకుని ఆహార వృధా లేకుండా చూసుకోవాలన్నారు. స్థానికంగా ప్రజలకు నిధులు, అధికారాలు వికేంద్రీకృతమైతే పర్యావరణ పరిరక్షణ కూడా తేలికవుతుందన్నారు. బలమైన స్థానిక ప్రభుత్వాలుంటే ప్రజలు సమర్థవంతంగా బాధ్యత తీసుకోగలుగుతారన్నారు. ❍

# గతంలోని మంచిని కొనసాగిస్తూనే మార్పుల్ని సాధించుకుంటుండాలి: హిట్ రిఫ్రెష్

***కాలం నియంత. కానీ మన ఆలోచనలు కాలాతీతం కాగలవు. సూర్యుడు ఉదయించటం, అస్తమించటం అనేవి ఉండవని ప్రత్యేకించి గుర్తించపోయినా.. ఆ రకమైన కాలాతీత భావనతో ఆలోచించటం మానవ మేధకు సాధ్యం. అందుకే విజ్ఞత గలవారెవరూ గతాన్ని సమూలంగా ధ్వంసం చేయకుండా గతంలోని మంచిని తీసుకుంటూ ఎప్పటికప్పుడు లక్ష్యసాధన దిశగా కొత్త మార్పులు చేసుకుంటూ ఉండాలని చెబుతుంటారు. ఇలా గతంలోని మంచినే చరిత్ర అని కూడా అనుకోవచ్చు. లోక్‌సత్తా వ్యవస్థీకృత కృషి నుంచి ఓ ఉదాహరణతో చెప్పాలంటే.. అన్నా హజారే నేతృత్వంలో అరవింద్ కేజ్రీవాల్, కిరణ్‌బేడీ తదితరులు లోక్‌పాల్ ఉద్యమం చేపట్టి ఉన్న వ్యవస్థలన్నిటినీ ధ్వంసం చేసి లోక్‌పాల్‌ను ఏర్పాటు చేయాలని చెప్పినప్పుడు, అది దేశానికి తీవ్ర నష్టం చేస్తుందని లోక్‌సత్తా వాదించింది.***




రాజకీయాలు సహా ప్రపంచంలోని ఏ రంగంలోని గొప్ప నాయకులకైనా పుస్తకంతో అవినాభావ సంబంధం ఉంటుంది. పుస్తకాలు చదవటం, రాయటం వారి నిత్య జీవితంలో భాగంగా ఉంటాయి. సాంకేతిక దిగ్గజం మైక్రోసాఫ్ట్ సారథిగా చిరపరిచితుడైన సత్య నాదెళ్ల ఇప్పుడు 'హిట్ రిఫ్రెష్' అనే పుస్తకాన్ని తీసుకొచ్చారు. 2015-16లోలో దీన్ని రాయడం ప్రారంభించారు. అనుకున్నట్టుగానే 2017లో తీసుకొచ్చారు. చిన్ననాటి అనుభవాలు ఉన్నా.. ప్రధానంగా పాతికేళ్ల మైక్రోసాఫ్ట్ అనుభవాల రంగరింపుగా ఈ పుస్తకం ఉంది.


హైదరాబాద్‌లో జన్మించిన తాను రెడ్‌మండ్ (అమెరికా)లో మైక్రోసాఫ్ట్ పగ్గాలు చేపట్టటం, తన పరిణామ క్రమం, మైక్రోసాఫ్ట్‌లో వచ్చిన మార్పులు, నేటి మానవ జీవితంలో పెనుమార్పులు సృష్టిస్తున్న ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, కృత్రిమ మేధ వంటివి ఎలా సమాజంలో ఎలా అంతర్భాగం కానున్నాయో ఇందులో ఉంటాయి.

'వ్యక్తులు కావొచ్చు, సమూహాలు కావొచ్చు ఎందుకు పరిణామం చెందాలి? గమ్యం వైపుగా సాగేటప్పుడు చోటుచేసుకునే మార్పులకు అనుగుణంగా తమను తాము తప్పకుండా ఎందుకు సంస్కరించుకోవాలి?' అనే విషయాలను నాదెళ్ల తన ఈ తొలి పుస్తకంలో వివరించారు. ఎప్పటికప్పుడు కొత్త ఉత్సాహంతో సరికొత్త ఆలోచలను ఆవిష్కరిస్తూ ముందుకు సాగే మార్గాలపై తన ఆలోచలను పంచుకున్నారు.

హిట్ రిఫ్రెష్ పుస్తక విక్రయాల ద్వారా వచ్చే డబ్బుని మైక్రోసాఫ్ట్ ధార్మిక కార్యక్రమాలకు వినియోగించనున్నారు. హార్పర్ కోలిన్స్‌కు చెందిన హార్పర్ బిజినెస్ దీన్ని ఆంగ్లంలో ప్రచురించింది.

"ఈ పుస్తకం మార్పునకు ప్రతీక. మైక్రోసాఫ్ట్ ఉద్యోగులు, ఖాతాదారులు, భాగస్వాముల కోసం దీన్ని రాస్తున్నాను. వృత్తి జీవితంలో వారి సొంత ముద్ర వేసేందుకు నా అనుభవాలు

ఉపయోగపడతాయని నమ్ముతున్నాను. విజయ శిఖరాలను ఎలా అధిరోహించాలో తెలిపే సూత్రాలను ఈ పుస్తకం నుంచి ఆశించొద్దు. అలాగని ఇదేదో జ్ఞాపకాల గనిగా కూడా భావించొద్దు'' అని సత్య 2016లో ఈ పుస్తక రచన గురించి వెల్లడిస్తున్నప్పుడు చెప్పారు.




“మైక్రోసాఫ్ట్ ఉత్పత్తులు మన జీవితాల్లో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. అయితే భవిష్యత్తులో రాబోయే టెక్నాలజీలేమిటి అన్న ప్రశ్నకు జవాబు అంత సులువు కాదు. పీసీలు, సర్వర్‌లు, క్లౌడ్ కంప్యూటింగ్ తర్వాత నా ఉద్దేశంలో డిజిటల్ యుగాన్ని.. మిక్స్‌డ్ రియాలిటీ (ఎంఆర్), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ–కృత్రిమ మేధ), క్వాంటమ్ కంప్యూటింగ్ (క్యూసీ) అనే మూడు రంగాలు శాసిస్తాయి. ఎంఆర్ వల్ల డిజిటల్ ప్రపంచం, భౌతిక ప్రపంచం ఒకటై పోతాయి. కృత్రిమ మేధ.. మానవ మేధస్సు పరిధిని మరింత విస్తృతం చేస్తుంది. భౌతికంగా ఈవేళ మనకు సాధ్యంకాని అనేక కొత్త కోణాలను అది ఆవిష్కరిస్తుంది. ఇక క్వాంటమ్ కంప్యూటింగ్.. మన కంప్యూటింగ్ శక్తియుక్తులనే మార్చివేస్తుంది” అని సత్య ఈ ఏడాది విడుదల చేసిన తన పుస్తకంలో పేర్కొన్నారు.

కాలం నియంత. కానీ మన ఆలోచనలు కాలాతీతం కాగలవు. సూర్యుడు ఉదయించటం, అస్తమించటం అనేవి ఉండవని ప్రత్యేకించి గుర్తించపోయినా.. ఆ రకమైన కాలాతీత భావనతో ఆలోచించటం మానవ మేధకు సాధ్యం. అందుకే విజ్ఞత గలవారెవరూ గతాన్ని సమూలంగా ధ్వంసం చేయకుండా గతంలోని మంచిని తీసుకుంటూ ఎప్పటికప్పుడు లక్ష్యసాధన దిశగా కొత్త మార్పులు చేసుకుంటూ ఉండాలని చెబుతుంటారు. ఇలా గతంలోని మంచినే చరిత్ర అని కూడా అనుకోవచ్చు. లోక్‌సత్తా వ్యవస్థీకృత కృషి నుంచి ఓ ఉదాహరణతో చెప్పాలంటే.. అన్నా హజారే నేతృత్వంలో అరవింద్ కేజ్రీవాల్, కిరణ్‌బేడీ తదితరులు లోక్‌పాల్ ఉద్యమం చేపట్టి ఉన్న వ్యవస్థలన్నిటినీ ధ్వంసం చేసి లోక్‌పాల్‌ను ఏర్పాటు చేయాలని చెప్పినప్పుడు, అది దేశానికి తీవ్ర నష్టం చేస్తుందని లోక్‌సత్తా వాదించింది. సీబీఐలాంటివాటిని సమూలంగా తీసేసి అలాంటి మరో వ్యవస్థను ఏర్పాటు చేసే లోగా జరిగే నష్టం అపారంగా ఉంటుందని స్పష్టం చేసింది. అందుకే ఉన్న వ్యవస్థల్లోని మంచిని పరిరక్షిస్తూనే కొత్త మార్పులతో లోక్‌పాల్ చట్టాన్ని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ రూపొందించి ప్రభుత్వానికి ఇచ్చారు. ప్రస్తుత లోక్‌పాల్ చట్టం చాలామేరకు లోక్‌సత్తా ప్రతిపాదనలతోనే రూపొందింది. లోక్‌సత్తా వాదనే కరెక్టని తర్వాతి పరిణామాలు రుజువు చేశాయి. ఒకరకంగా ఇది 'కంటిన్యుయిటీ అండ్ ఛేంజ్'! రాజ్యాంగం పనితీరును మెరుగుపరచడానికి కూడా ఇదే సూత్రం సరైనదని లోక్‌సత్తా భావిస్తుంది. దాదాపు దశాబ్దం క్రితం రాజ్యాంగం పనితీరుపై ఏర్పాటైన జాతీయ కమిషన్‌కు కూడా కంటిన్యుయిటీ అండ్ ఛేంజ్ పేరుతోనే జేపీ సంప్రదింపుల పత్రాన్ని సమర్పించారు (లోక్‌సత్తా పబ్లికేషన్స్‌లో చదవొచ్చు). కెరీర్‌లో కూడా సత్య నాదెళ్ల ఇదే సూత్రాన్ని నమ్ముతారు. ఈ విషయాన్ని మైక్రోసాఫ్ట్ వ్యవస్థాకుల్లో ఒకరైన బిల్‌గేట్స్ ముందుమాటలో చెబుతూ, “సత్య హిట్ రిఫ్రెష్ అనే సూత్రాన్ని నమ్ముతాడు. అదే ఈ పుస్తకం శీర్షిక కూడా. బ్రౌజర్‌లో ఉన్న రిఫ్రెష్ బటన్‌ను క్లిక్ చేస్తే.. పేజీలో కొన్ని అంశాలు అలాగే ఉంటాయి. మరికొన్ని మారిపోతాయి. అంటే గతాన్ని వదిలేయకుండా ముందుకెళ్లడమన్నమాట. ఇదే ఈ శీర్షిక అర్థం. సత్య నేతృత్వంలో మైక్రోసాఫ్ట్ విండోస్ కేంద్రీకృత వ్యవహారాలకు మాత్రమే పరిమితం కాకుండా కొత్త టెక్నాలజీలను అభివృద్ధి చేసే కంపెనీగా మారింది” అన్నారు. ❍

# పాలకులు మారినా పాలన మారలేదు

తెలంగాణలో పాలకులు మారినా పాలన మారలేదని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాతులూరి గోవిందరావు అన్నారు. గత పాలకుల విధానాలనే టీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. సూర్యాపేట జిల్లాలోని కార్యాలయంలో జిల్లా ఇంఛార్జి పూదూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సత్తా విధానాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, బలోపేతం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. అనంతరం లోక్‌సత్తా పార్టీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రావెళ్ల రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా పల్లేటి రవికుమార్, అధికార ప్రతినిధిగా బండారు నాగరాజు ఎన్నికయ్యారు. పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇంఛార్జిగా పిల్లుట్ల లింగయ్య నియమితులయ్యారు. సమావేశంలో వంటెపాక యాదగిరి, జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, బాణాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.





**నండ జిల్లా కమిటీ**

లోక్‌సత్తా పార్టీ నల్గొండ జిల్లా నూతన కమిటీ కూడా గోవిందరావు సమక్షంలో ఏర్పాటైంది. జిల్లా అధ్యక్షుడిగా వంటిపాక యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా ఏరుకొండ లక్ష్మయ్య, అధికార ప్రతినిధిగా బెలిదె వీరప్రతాపరావు, కార్యదర్శిగా విశ్వనాథుల రమేషాచారి ఎన్నికయ్యారు. జిల్లా యువసత్తా అధ్యక్షుడిగా మంద శ్రీనివాస్ నియమితులయ్యారు.

**ఖమ్మం టీం**

లోక్‌సత్తా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చింతల నాగేశ్వరరావు, లింగబోయిన పుల్లారావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాంబాబు, రమేష్, వెంకటేశ్వర్లు, లెనిన్, రవికుమార్, నర్సింహారావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు. సాతులూరి గోవిందరావు పర్యవేక్షించారు. ❍

# లోక్‌సత్తా ఎంపీటీసీ రాజశేఖర వర్మ కృషి ప్రశంసనీయం



ఎదుర్లంక ప్రజల సంక్షేమం కోసం, నిరుద్యోగులకు ఉపాధినందించటం కోసం, ప్రాంత సమగ్ర అభివృద్ధి కోసం ఎంపీటీసీ (లోక్‌సత్తాపార్టీ) ముదునూరి రాజశేఖరవర్మ అంకితభావంతో చేస్తున్న కృషి ప్రశంసనీయమని నాబోర్స్ సెక్యూరిటీ ఉద్యోగుల ఆధ్వర్యంలో జరిగిన అభినందన సభలో పలువురు పేర్కొన్నారు. సెక్యూరిటీ సిబ్బందికి ఉద్యోగాలు వచ్చేలా చేయడంతోపాటు, రోజువేతనం పెంపునకు కృషి చేశారన్నారు. యువతకు ఉపాధినందించటం, ఆదాయం పెంచే ఏర్పాట్లు కల్పించటం ఈవేళ రాష్ట్రంలో, దేశంలో ప్రతి నాయకుడూ చేయాల్సిన పని అని, విద్యావంతుడైన రాజశేఖరవర్మ లోక్‌సత్తా పేరు నిలబెట్టేలా ఈ పని చేశారని అన్నారు.

రాజశేఖర వర్మ మాట్లాడుతూ.. కార్మిక చట్టాలకు అనుగుణంగా కనీస వేతనాలు అందుతున్నాయో లేదో తెలుసుకునేందుకు కేంద్ర కార్మిక విభాగం అధికారి ముళ్లపూడి ప్రసాద్ గ్రామంలో ఉన్న ఆయిల్ ఇండియా సంస్థ రిగ్గు వద్దకు వచ్చారని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని కార్మికులకు నెలవారీ కనీస వేతనం రూ. 15,000 ఉండేలా వెంటనే చర్యలు తీసుకునేలా చేయగలిగానని అన్నారు. కార్మికులకు ఎనిమిది నెలల జీతభత్యాల బకాయిల కింద ఒక్కొక్కరికి రూ. 30,000 వెంటనే విడుదల చేయాలని ఆదేశించారని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా.. ఎదుర్లంకలో పనిచేస్తున్న ఆయిల్ ఇండియా ఉద్యోగులంతా కలిసి బహుమతి ఇవ్వబోగా రాజశేఖర వర్మ తిరస్కరించారు. ఆ డబ్బును ప్రభుత్వ పాఠశాలకు విరాళంగా ఇవ్వాలని సూచించారు. దీంతో ఆయన ద్వారానే ఉద్యోగస్తులు డబ్బును పాఠశాలకు ఇచ్చారు. కార్యక్రమంలో ముదునూరి కృష్ణమూర్తి రాజు, వేగేష్న వెంకట సత్యగోపాల రాజు, పలివెల వెంకటేశ్వరరావు, ముదునూరి సత్యనారాయణ రాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎం. నూకాంబరం, కడలి సత్తిబాబు, సీఎంరాజు, ఇళ్ల రాంబాబు, బీర సత్యనారాయణ, ఉండ్రు నాగేశ్వరరావు, బంతు వీరంశెట్టి, కె. నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. ❍

# వివక్ష లేకుండా ఎదిగే అవకాశాలున్న సమాజం కోసమే లోక్‌సత్తా పార్టీ పోరాటం






దేశంలో అత్యధిక సంఖ్యలో ఉన్న పేద, బడుగు బలహీన, మధ్యతరగతి ప్రజల కోసం నిజమైన రాజకీయాన్ని, విధానాల్ని అందించిన తొలి పార్టీ లోక్‌సత్తా అని పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. అక్టోబర్ 2న లోక్‌సత్తా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నేతలతో కలిసి ఆయన విజయనగరంలో జెండా ఎగురవేశారు. వివక్ష లేకుండా ప్రతి బిడ్డా ఎదిగేందుకు విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి రంగాల్లో లోక్‌సత్తా కార్యకర్తలు, అభిమానులు సొంత వనరులను వెచ్చించి పనిచేస్తున్నారన్నారు. ఒక్క పార్లమెంటు సభ్యుడు కూడా లేకుండానే కేవలం విధానపరమైన బలంతో, అందరినీ ఒప్పించే రాజకీయ సంస్కృతితో పలు కీలక ఫలితాలను సాధించామన్నారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు లక్కరాజు శివరామారావు, మహిళాసత్తా జిల్లా అధ్యక్షురాలు అనంతలక్ష్మిలను సన్మానించారు. లోక్‌సత్తా పార్టీ నాయకులు అల్లంశెట్టి నాగభూషణం, మొల్లేటి చిన్నారావు, శిమ్మ శ్రీను, తాత్రాజు రాజారావు, కాళ్ల శ్రీను, బంటు అర్జున, తేజ, కోటేశ్వరరావు, బూడి సన్యాశిరావు, ఎర్నిబాబు తదితరులు పాల్గొన్నారు. ❍

# తిలక్, గాంధీ, అంబేద్కర్, పీవీజీ పేర్లతో ప్రధానకూడళ్లు








విజయనగరం పట్టణంలోని ప్రధాన కేంద్రాలకు ప్రముఖుల పేర్లు పెట్టడానికి మన పాలకులకు తీరికలేదని, అందుకే గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి రోజున పౌరవేదిక ఆధ్వర్యంలోని ప్రజా సంఘాలతో కలిసి ఆ పని తామే చేశామని వేదిక అధ్యక్షుడుగా కూడా వ్యవహరిస్తున్న భీశెట్టి బాబ్జీ అన్నారు. కోర్టుకు ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం.. వివిధ సంఘాల ప్రతినిధులతో కలిసి విజయనగరం ప్రవేశ దగ్గర పీవీజీ జంక్షన్‌గా, ఎత్తుబ్రిడ్జి వద్ద రాజీవ్ జంక్షన్‌గా, మయూరి వద్ద తొలి పార్లమెంట్ సభ్యుడు కందాళ సుబ్రమణ్య తిలక్ జంక్షన్‌గా, బాలాజీ వద్ద అంబేద్కర్ జంక్షన్‌గా, స్టేట్ బ్యాంకు మెయిన్ బ్రాంచి వద్ద గాంధీ జంక్షన్‌గా నామకరణం చేసి బోర్డులు తగిలించారు. ఇప్పటికీ పట్టణంలోని ప్రధాన కూడళ్లను సినిమా హాళ్ల పేరుతో పిలవటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో వేదిక కార్యదర్శి గిడుతూరి పైడితల్లి, ఆదాడ మోహనరావు, పీవీ రమణ, భానుమూర్తి, అశ్విన్, చోడి ఆదినారాయణ, రామేశ్వరపు రామారావు, సుకుమార్, బంటు అర్జున్, తేజ, పెంటబాబు, భాస్కర్, శ్రీను, అనంతలక్ష్మి, మొల్లేటి చిన్నారావు, కోటి, సన్యాశినాయుడు తదితరులు పాల్గొన్నారు. ❍

# మోదీ ఆర్థిక విధానాలపైనా పదునెక్కుతున్న విమర్శలు

దేశ ఆర్థిక వ్యవస్థ భేషుగ్గా ఉందని కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ న్యూఢిల్లీలో జరిగిన బీజేపీ విస్తృతస్థాయి జాతీయ కార్యవర్గ సమావేశంలో ప్రకటించిన సాయంత్రమే ప్రధాని నరేంద్ర మోదీ తన పంథా మార్చుకుని మరీ ఆర్థిక సలహా మండలిని ఏర్పాటు చేశారు. ఆ మరుసటి రోజే బీజేపీ సీనియర్ నేత, కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా మోదీ, జైట్లీల ఆర్థిక పాలనా సామర్థ్యంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. క్షేత్రస్థాయి పరిస్థితుల్లోనూ స్తబ్దత, వ్యాపార వర్గాల్లో, మధ్యతరగతి ప్రజల్లోనూ అసంతృప్తి పెరుగుతుండటంతో మోదీ ప్రభుత్వంలో అభద్రత మొదలైంది. యశ్వంత్ సిన్హా ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న 80 ఏళ్ల నిరుద్యోగని, వ్యక్తిగత విమర్శలు ఉండకూడదన్న కనీస సాంప్రదాయాన్ని కూడా పాటించకుండా విమర్శలు చేశారని అరుణ్ జైట్లీ ఎదురుదాడి చేసినా, యశ్వంత్ సిన్హా కుమారుడు జయంత్ సిన్హా చేత కూడా తిప్పికొట్టించినా, చివరకు మోదీయే రంగంలోకి దిగి భరోసా ఇచ్చినా.. అవి పెద్దగా పేలలేదు. ఆర్థికరంగం పనితీరుపై మోదీ సొంత పార్టీలోనే సెగలు రేగుతున్నాయి. ఏదోక గట్టి పరిష్కారం అవసరమన్న భావన సర్వత్రా కనిపిస్తోంది.

### ఆ లెక్కల ప్రకారం జీడీపీ 3.7 శాతమే

గత మూడున్నరేళ్లలో దేశ ఆర్థికాభివృద్ధి క్రమంగా క్షీణిస్తూ వస్తోందని, ఇందుకు కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని యశ్వంత్ సిన్హా అన్నారు. భయంతో మాట్లాడలేక సతమతమవుతున్న చాలామంది బీజేపీ నేతల మనోభావాలకు తన మాటలు అద్దం పడతాయన్నారు.

"జైట్లీ ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేశారు. దీని గురించి మాట్లాడటంలో విఫలమైతే నా జాతీయ బాధ్యతను విస్మరించినట్టే" అని యశ్వంత్ తన వ్యాసాన్ని మొదలు పెట్టారు. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో ఇది ప్రచురితమైంది.

"పేదరికాన్ని దగ్గర నుంచి చూశానని ప్రధాని మోదీ తరచూ చెబుతుంటారు. కానీ పేదరికాన్ని అంతే దగ్గరగా ప్రతి భారతీయునికీ చూపించేందుకు జైట్లీ చాలా కష్టపడుతున్నారు" అని వ్యాఖ్యానించారు. "జీడీపీని లెక్కించే విధానాన్ని ప్రస్తుత ప్రభుత్వం 2015లో సవరించింది. దీని ప్రకారం చూస్తే ప్రస్తుత 5.7 శాతం వృద్ధి రేటు పాత లెక్కల్లో 3.7 శాతానికి మాత్రమే సమానం. పెద్ద నోట్ల రద్దు తర్వాత ఆర్థిక వ్యవస్థ తిరోగమిస్తోంది. మళ్లీ పురోగమనానికి ఎన్నేళ్లు పడుతుందో అర్థం కావడం లేదు" అని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఆర్థిక శాఖ పనిచేస్తున్న తీరు, సోదాలు, దాడులను యశ్వంత్ సిన్హా ఆక్షేపించారు.



### సంకీర్ణాల్లోనే మెరుగైన వృద్ధి


సంకీర్ణ ప్రభుత్వాల హయాంలోనే భారత్‌లో మెరుగైన ఆర్థిక వృద్ధి నమోదైందని ఆర్బీఐ మాజీ గవర్నర్ వై.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. 1991లో దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు రాజకీయ ఏకాభిప్రాయంతో సంకీర్ణమే ఆ పరిస్థితిని విజయవంతంగా అధిగమించిందన్నారు.

రోజువారీ వ్యవహారంగా మారిన సోదాలు, దాడులు ప్రజల మనసుల్లో భయాన్ని నింపి బెంబేలెత్తిస్తున్నాయని, ఇప్పుడివి కొత్త ఆటగా మారాయని ధ్వజమెత్తారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంకన్నా నాశనం చేయడం సులువన్నారు. 90వ దశకంలో (పీవీ నరసింహారావు) సంస్కరణలతో వేసిన పునాదిని మోదీ ప్రభుత్వం గత నాలుగేళ్లలో నాశనం చేసిందన్నారు.

మొదటిసారి 40 అతిపెద్ద కంపెనీలు దివాళా తీశాయని, చిన్న, మధ్యతరహా పరిశ్రమలన్నీ సంక్షోభంలో కూరుకుపోయాయని సిన్హా అన్నారు. రెండు దశాబ్దాలుగా ఎన్నడూ లేనివిధంగా పెట్టుబడులు పూర్తిగా తగ్గిపోయాయని, పారిశ్రామిక ఉత్పత్తి పడిపోయిందని అన్నారు. వ్యవసాయ, నిర్మాణ రంగాలు ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నాయన్నారు. యశ్వంత్‌సిన్హా చంద్రశేఖర్ ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా, వాజ్‌పేయి ప్రభుత్వంలో విదేశాంగమంత్రిగా పనిచేశారు. ఆయన కుమారుడు జయంత్‌సిన్హా ప్రస్తుతం కేంద్రమంత్రివర్గంలో విమానయాన సహాయ మంత్రిగా పనిచేస్తున్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థపై తాను రాసిన వ్యాసంలోని ప్రతి అక్షరానికీ కట్టుబడి ఉంటానని యశ్వంత్ సిన్హా తనపై వచ్చిన విమర్శలకు సమాధానంగా చెప్పారు. తాను ఏదో ఒక త్రైమాసికం (క్వార్టర్) లెక్కలను పరిగణలోకి తీసుకొని దేశ ఆర్థికం గురించి మాట్లాడటం లేదని, వరుసగా ఆరు క్వార్టర్ల గణాంకాలను పరిశీలించాక చెబుతున్నానని తెలిపారు. ❍

# మా మేధావులు అనబడేవాళ్లు పట్టించుకుంటున్నారా, ప్రజలెందుకు ప్రశ్నించలేకపోతున్నారన్నవే నా ప్రశ్నలు: కాళోజీ




ఆయన గళం వేయి గొంతుకల ఉద్యమ శంఖం. ఆయన కలం పాలనా దురన్యాయాలపై స్వరం. నూనూగు మీసాల నూత్నయవ్వన ప్రాయం నుంచే అన్యాయాలను, అక్రమాలను ఎదిరిస్తూ తొంభయ్యవ పడిలో కూడా అదే ఒరవడిలో పోరాట సంప్రదాయాన్ని కొనసాగించిన ఉడుకు రక్తమది. "ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక" అంటూ ముదిమి వయసులో సైతం సిరాతో సెగలు రగిలించిన ప్రజాకవి, కళారవి.. కాళోజీ నారాయణరావు.

అలనాడు ఎమర్జెన్సీలో అమాయక యువకులను చెట్లకు కట్టి పిట్టల్ని కాల్చినట్టు చంపుతుంటే ఏమిటీ అన్యాయం? ఏమిటీ ఘోరం? అని ప్రశ్నించిన అసలు సిసలు పౌరహక్కుల ఉద్యమ నేత కాళోజీ. పదహారేళ్ల ప్రాయం నుంచే అన్యాయాన్ని ఎదిరిస్తూ పాలకుల్ని ప్రశ్నిస్తూ, ధిక్కార స్వరం వినిపిస్తూ ప్రజల పక్షం వహించిన నిత్యసమరశీలుడు ఆయన. ప్రజల భాష యాస తన భావవాహినిలో కలగలిపి పాటగా ప్రవహించి ప్రజాకవిగా నిలిచిన ప్రజ్ఞాశీలి. మూడు తరాలను ఉత్తేజితుల్ని చేసిన ఆయన జీవితమే ఒక ఉద్యమం!

ధర్మాగ్రహం ప్రకటించే కాళోజీ లోక్‌సత్తా కార్యకలాపాలను తొలినుంచే గమనిస్తూ ఉన్నారు. ప్రజల కోసం పనిచేసే నీతిపరుల్ని కాళోజీ గుండెలకు హత్తుకుంటారు. పాలకుల దుర్మార్గాలను ప్రశ్నించాలని పిలుపునిస్తుంటారు. సమాజంలోని పరిస్థితులు, ప్రభుత్వాల తీరుపై ఆయన జీవించి ఉన్న సమయంలో లోక్‌సత్తా ఉద్యమ నాయకులతో ముచ్చటించారు. ఆయన మనసు విప్పి చెప్పిన నాలుగు మాటలు 'లోక్‌సత్తా టైమ్స్' పాఠకుల కోసం..

మంచి పాలన వస్తుందంటారా? అని కాళోజీతో లోక్‌సత్తా ప్రస్తావించినప్పుడు.. అన్యాయాన్ని ఎదిరించడం, అక్రమాలను ప్రశ్నించడంతోనే నా జీవితమంతా గడిచిపోతున్నది. అందరూ ఎందుకని ప్రశ్నించలేకపోతున్నారన్నది నా ప్రశ్న! అందరూ ప్రశ్నించిన రోజు మంచి రోజు వచ్చినట్టే. ఇక మంచి పాలన వచ్చుడు గురించి 'నా గొడవ'లో అన్నాను.

"ఉదయం కానే కాదనుకోవడం నిరాశ"

"ఉదయించి అట్లానే ఉంటుందనుకోవడం దురాశ"

.. మంచి పాలన వస్తుందనే ఆశిద్దాం.

ప్రశ్నించే ప్రజల్ని పాలకులు పట్టించుకోవడం లేదు. ఇందుకు ఏం చేస్తే బాగుంటుందో చెప్పమని అడిగినప్పుడు ఆయన ఇలా స్పందించారు..

పాలకులు ప్రశ్నించినవాడ్ని ఎప్పుడు పట్టించుకున్నారు గనుక? అయితే నాటి నిజాం పాలనే నయమనిపించేటట్లు ఇవాళ్ల ప్రజాస్వామ్య ప్రభుత్వ పాలకులు ప్రవర్తిస్తున్నారు.

పాలకులు మారిండ్రుగానీ పాలన పద్ధతి మారలేదు. జెండా మారింది, దందా మారలేదు. "ఎగిరే జెండా కాదు, ఆడించే దందా చూడు" అని నా గొడవన్నది.

పాలకుల లక్షణాలు నిజాం నాటి నుంచి ఇవ్వాల్టి వరకు ఒక్క తీరుగనే ఉన్నాయి. 1944లో జనగామ, నల్లగొండలో నిజాం ప్రభుత్వం ప్రజలపై చేసిన దౌర్జన్యాల గురించి "పోలీసండవ దౌర్జన్యాల పోషణ బొందెదెన్నాళ్లు? దొంగలు దొంగలు ఊళ్లు పంచుకుని దొరలై వెలిగెదెన్నాళ్లు? పగటి దోపిడిదారుల నాపగలేని ప్రభుత్వ ముండెదెన్నాళ్లు? బాధ్యతలేని ప్రభుత్వ భటులు పెట్టె బాధలు చాలింక.." అన్నాను.

ఇందిర హయాంలో..

"నా దేశాన్ని పాలించేది, నా జాతిని రక్షించేది
నా శక్తిని పోషించేది, నా ఓటును శాసించేది
గుండాలా, తుపాకి గుండ్లా, సట్టా వ్యాపారం దిండ్లా
ప్రజాస్వామ్య లక్షణ, లక్షిత భారత రాజ్యాంగం కండా?

అని అడిగిన.

1966లో.. బడుగు జాతి నడిస్తే, బలిసినోడు ఎయిడ్ ఇస్తే బత్యాలకు సరిపుచ్చుక బతుకుదెరువు ఎన్నాళ్లు? అన్నా. 1975లో.. రాష్ట్రపతి ఏమంటవు? కాళోజీ బెజారై అడుగుతాండు అని రాసిన.

ఈ పరిస్థితులు.. 1944గాని, 75గాని.. ప్రభుత్వాల పద్ధతి ఒక్కటే అనిపిస్తలేదా?

బాధ్యతలేని ప్రభుత్వం 1944లో. మరి ఇవ్వాళ్ల అంటే.. జవాబుదారీతనం లేదు.. ఆ జవాబుదారీతనం పాలకుల్లో రావాలె! ప్రజలందరూ, పౌరులు అనిపించుకుంటున్న వాళ్లందరూ ప్రశ్నించాలె.

పాలకులు పట్టించుకోవడం సరే, ప్రజలు పట్టించుకుంటున్నారా? మా మేధావులు అనబడే వాళ్లు పట్టించుకుంటున్నారా అని నా ప్రశ్న.

ఇంకొక్క విషయం.. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఎంతటి బలవంతునికైనా ధనవంతునికైనా నేరం చేసే అవకాశం ఉండకూడదు. ఎంతటి దరిద్రుడికైనా, బలహీనుడికైనా నేరం చేసే అవకాశం రాకూడదు.

పారదర్శక పాలన గురించి ప్రశ్నించినప్పుడు కాళోజీ చురకలంటించారు..

'పారదర్శక పాలన లేదని ఎవరంటున్నారు? నేరం చేయలనుకునే వారికంతా పారదర్శకతే! అధికార రహస్యాలు అనబడేటివి నేరం చేసేవారికి ముందే తెలుస్తున్నవి. పౌరులకే తెలవవు. ఇందిరను గురించి రాసిన. "పరివారితో ఇంటిమసీ, ప్రజలతోటి డిప్లొమసి, ఇదెక్కడి డెమోక్రసి.. ఇదే డెమనాక్రసి" అని.

**"అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు సంతృప్తి,**
**అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తి ప్రాప్తి,**
**అన్యాయాన్ని ఎదిరించిన వాడే నాకారాధ్యుడు"**

# నీటిని విడుదల చేయించండి



ఎగువ ప్రాజెక్టులు, శ్రీశైలం నుంచి తెలంగాణ ప్రాజెక్టులకు న్యాయంగా రావాల్సిన నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ డిమాండ్ చేసింది. నీటి వివాదాలపై కేంద్రప్రభుత్వం చోద్యం చూస్తుండగా, తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు బాధ్యతారహితంగా, ప్రజల మధ్య పొరపొచ్చాలను పెంచి లబ్ధిపొందేలా వ్యవహరిస్తున్నాయని పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు రావెళ్ల రవికుమార్ అన్నారు. సాగునీటి విడుదలకు సంబంధించిన పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయన ఎస్ఎస్‌పీ సబ్ డివిజన్ కార్యాలయంలో డీఈ యలమందయ్యకు అందచేశారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. రమేష్ కుమార్, అధికార ప్రతినిధి నాగరాజు, సోమయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# (మీడియాలో) 'కీ' కామెంట్లు!

■ మన ప్రణాళికా రచన, నిర్వహణలను గుర్రానికి ముందు బండి కట్టడమనే రుగ్మత పీడిస్తోంది. అందుకు ముంబయి ఎల్ఫిన్‌స్టోన్ రైలు స్టేషన్ వద్ద దుర్ఘటనే సాక్ష్యం. ప్రభుత్వ ఛత్రం కింద పనిచేసే సంస్థలన్నిటికీ.. పెరుగుతున్న అవసరాల దృష్ట్యా తలెత్తే సమస్యలకు అనుగుణంగా ప్రణాళికలను మొదలుపెట్టగల ఊహాత్మకత కొరవడింది. పాలనా యంత్రాంగంలో కాలయాపన, సోమరితనం రివాజుగా మారాయి. ఎలాంటి లోటుపాట్లనైనా పంటి బిగువున భరించడానికి ప్రజలు చూపే సుముఖతే సోమరితనం చూపే దోషులకు రక్షణ అవుతోంది.

– మహేష్ విజపుకర్, సీనియర్ పాత్రికేయులు

■ బ్రిటీష్ వలస పాలనకు ముందు కూడా భారతదేశంలో నాణ్యమైన చదువు కేవలం ఉన్నత వర్గాలకే పరిమితమైంది. సామాజిక స్థాయిని కులం, వర్గం వంటివి నిర్ణయిస్తుండటం ఇందుకు కారణాలు. గురుకులాలు, ఇతర సంప్రదాయ పాఠశాలల్లో చోటు సంపాదించుకోగలిగిన కొద్దిమంది ఏకలవ్యుల్ని ఉంటే ఉండొచ్చు. విద్యను ఒక హక్కుగా అందరికీ అందించటమనేది మెకాలే కంటే ముందు మనదేశంలో లేదని అంగీకరించక తప్పదు. మన బహుళ జానపద సంప్రదాయాల పునాది మీద ప్రపంచీకరణ రూపాలను అభివృద్ధి చేయటం, ఉమ్మడి పాఠ్యప్రణాళికలతో దేశవ్యాప్తంగా అందరికీ ఇంగ్లిష్‌ను అందుబాటులోకి తేవడం ఇప్పుడు మన విద్యావిధానం కావాలి. ఈ మార్పులు తేకుంటే.. దేశాన్ని పట్టిపీడిస్తున్న అనేక రుగ్మతలు అలాగే కొనసాగుతుంటాయి, వాటన్నిటికీ మెకాలేయే కారణమని నిందిస్తూ కాలక్షేపం చేస్తూనే ఉంటాం.

– ఆచార్య సుధీర్ చల్లా రాజన్, ఐఐటీ-మద్రాస్

■ ***అవినీతిపై పోరాడి అధికారంలోకి వచ్చిన వారు ఉన్నారు. నిరంతరం అవినీతి నిర్మూలన గురించి ఉపన్యాసాలు ఇచ్చే అవినీతిపరులు ఉన్నారు. అవినీతిలో ఎంత రాటుదేలిపోతే నైతిక విలువల గురించి అంత ఎక్కువ మాట్లాడే దశకు చేరుకున్నారు. మునిసిపాలిటీ అధికారి ఇంట్లో రూ.500కోట్లు, ఓ పోలీసు అధికారి ఆస్తి 300కోట్లు, ఆ శాఖ ఈ శాఖ అని లేదు.. 20-20 మ్యాచ్‌లో రన్స్‌లా వీళ్ల ఆస్తుల చిట్టా కనిపిస్తోంది. వాళ్లు అని వందల కోట్లు ఎలా పోగుచేశారు. వ్యవస్థకు హఠాత్తుగా దివ్యదృష్టి వచ్చి పట్టుకుందా? అన్నీ అనుమానాలే. సంపాదన ఎలా సాధ్యం అనేది అనుమానమే. ఎలా దొరికిపోతున్నారన్నది అనుమానమే. ఓ ఉద్యోగి అరవై కోట్లు పోగు చేసుకోవడానికి వీలుగా ఉన్న బలహీనమైన వ్యవస్థనా మనది. తలచుకుంటే భయం వేస్తుంది.***

**- బుద్దా మురళి,** సీనియర్ జర్నలిస్టు

■ *అందరికీ లీడర్ పక్కింట్లో కావాలి. మన ఇంట్లో వద్దు. వ్యవస్థ మారాలి. కానీ ప్రశ్నించొద్దు".. ఇలా ప్రతి ఒక్కరూ అనుకోవడం వల్లే మోసాలు పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం యువత మార్పును కోరుకుంటోంది. వారికి సరైన గైడెన్స్ ఇచ్చేవారు లేరు. అందుకే ఒక ఎన్‌జీవోను స్థాపించాలనుకుంటున్నాను.*

*- విజయ గోపాల్, యువ ఐటీ ఉద్యోగి*

(కర్టెసీ: సాక్షి, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, ది హిందూ)

# పెట్రో బంకుల్లో అక్రమ కొలతలు, కల్తీలపై మరో యుద్ధం.. సురాజ్యం కోసం పార్టీలకతీతంగా యువ, ప్రజాఉద్యమం

**బైక్, స్కూటీ, కారు, వ్యవసాయ పంపు సెట్‌లు, ట్రాక్టర్, ఆటో, వ్యాన్, ట్రక్కు, లారీ, జనరేటర్, పారిశ్రామిక యంత్రాలు.. ఇలా ఏదోక అవసరం కోసం పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేసే వారి జాబితాలో మీరూ ఉన్నారా?**

**అయితే లోక్‌సత్తా అందిస్తున్న ఈ పరిష్కార కరపత్రం మీ కోసమే!**

**పరిష్కారం తెలుసుకునేముందు మీ సమస్యను ఫిక్స్ చేయనివ్వండి.**

**పెట్రోలు బంకుల్లో అక్రమ కొలతల వల్ల మీలాంటి వినియోగదారుల జేబులకు తెలుగు రాష్ట్రాల్లోనే రోజుకు రూ.6కోట్లు చిల్లుపడుతుండగా, దేశవ్యాప్తంగా రూ.80కోట్లు నష్టపోతున్నారు. హైదరాబాద్‌లోనే రోజూ రూ.1.5కోట్లు మనం నష్టపోతున్నట్టు అంచనా.**

**రూ.100 అప్పు ఇవ్వాలంటే వడ్డీ కింద రూ.10 కట్ చేసుకుని ఇచ్చే కాబూలీవాలాలను చూసివుంటారు. కానీ చెప్పి వసూలు చేసే ఆ వడ్డీ వ్యాపారుల కన్నా భయంకరమైనవాళ్లు మన పెట్రో బంకులవాళ్లు. రూ.100 పెట్రోల్ కొడుతున్నామని చెప్పి రూ.10 పెట్రోల్ నొక్కేస్తున్నారు. ప్రతి వందకీ ఇంతే. ఆ తర్వాత కల్తీకి పాల్పడుతూ కూడా దోచేస్తున్నారని తనిఖీల్లో బైటపడింది. ముమ్ముందు విదేశీ పెట్రోలు బంకులు కూడా వస్తున్నాయి. వ్యాపారం ఎవరిదైనా మనం దోపిడీ బారిన పడకూడదు, దోపిడీని సహించకూడదు.**

చాలా పెట్రోల్ బంకులలో నాఫ్తాలిన్, కిరోసిన్‌తో కల్తీ చేయటంతోపాటు ప్రతి లీటరుకు వంద మిల్లీలీటర్లు తక్కువ ఇంధనం పోస్తూ దోపిడీ చేస్తున్నారు. కల్తీ, దోపిడీపై దేశవ్యాప్తంగా ఫిర్యాదులు రావడంతో కేంద్ర ప్రభుత్వం దీనిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. మన తెలుగు రాష్ట్రాలలో కూడా తూనికలు కొలతల శాఖ తనిఖీలు చేపడితే కల్తీ, దోపిడీలు వాస్తవమని చాలా బంకుల్లో తేలింది.

ఈ దోపిడీపైనే లోక్‌సత్తా పరిష్కార యుద్ధం చేస్తోంది. మీ అందరి భాగస్వామ్యంతో.. అయితే ఇది రెండోసారి, రెండోదశలో (2.0) పార్టీలకతీతంగా చేస్తున్న యుద్ధం.

'జనం కోసం జేపీ' సురాజ్య యాత్రలో భాగంగా 'యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్', 'సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్' వెబ్ ప్లాట్‌ఫారాలలో నమోదైన ప్రజలు, ముఖ్యంగా యువతతో ఈ కార్యక్రమాన్ని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అక్టోబర్, 2017లో వెబ్ ప్లాట్‌ఫాం ద్వారా వినూత్నంగా ప్రారంభించారు.

గుర్తొచ్చిందా.. 'లోక్‌సత్తా.. ఇది మీ సత్తా' అంటూ లోక్‌సత్తా చేసిన పలు పోరాటాల్లో పెట్రోల్ బంకులపై చేసిన పోరాటం కూడా ఉందని! అప్పుడు కూడా పోరాటం ఇదేరకం కల్తీ, దోపిడీలపైనే.

'ప్రజలే ప్రభువులు' అంటూ ప్రజల చుట్టూ పాలన కోసం



హక్కుగా అందించాల్సిన పౌరసేవల (సిటిజన్స్ ఛార్టర్స్)తో 1998లో 'స్వరాజ్యం' పుస్తకాన్ని ఆవిష్కరించాక అక్టోబర్ 2న పెట్రోల్ బంకుల్లో అక్రమాలపై పోరాటాన్ని లోక్‌సత్తా చేపట్టింది. 1997 ఆగస్టు 3న ఆవిర్భవించిన లోక్‌సత్తా ఉద్యమ సంస్థ చేసిన మొట్టమొదటి ప్రజాఉద్యమ కార్యక్రమమిది. అప్పటివరకూ బంద్‌లు, రాస్తారోకోలు, విధ్వంసాల చుట్టూ తిరుగుతున్న ఆందోళనల్ని రాజ్యాంగ, నాగరిక ప్రజాస్వామ్య పద్ధతుల్లోకి మళ్లించి.. లోక్‌సత్తా నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణతో పెట్రోల్ బంకులకు వెళ్లి కల్తీని, దోపిడీని బైటపెట్టి ఎండగట్టారు. డా॥ జేపీ ఈ ఉద్యమాన్ని కొన్ని బంకులలో ప్రారంభించగా, రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండల కేంద్రాల్లో ఉద్యమ కార్యకర్తలతోపాటు సామాన్య ప్రజానీకం కూడా పాల్గొన్నారు. కేసులు పెట్టారు. లీటరు, ఐదు లీటర్లు క్యాన్లలో కొలతలు తీసుకోవటం, టిష్యూ పేపర్‌పై ఒక చుక్క పెట్రోలు వేసి కల్తీని

కనిపెట్టటం ద్వారా పెట్రోల్ దోపిడీ నుంచి బైటపడాలని ప్రజలను చైతన్యపరిచారు.

దీంతో రాష్ట్ర ప్రభుత్వ తూనికలు కొలతల శాఖ వెంటనే దాడులు ప్రారంభించింది, ఉమ్మడి రాష్ట్రంలో ఆనాడున్న 1500 పెట్రోలు బంకుల మీటర్లని సరిచేసింది. ఆ తర్వాత ఈ పెట్రో కల్తీ, దోపిడీ వ్యతిరేక ఉద్యమం దేశవ్యాప్తంగా కూడా రాజుకుంది. దీంతో దాదాపు కొన్నేళ్లపాటు పెట్రోలు వినియోగదారులకు నాణ్యమైన సేవలను బంకులు అందించాయి. కాస్త విషయ పరిజ్ఞానం, ప్రజల భాగస్వామ్యంతో చట్టాన్నే వినియోగిస్తూ చేసిన ఓ చిన్న ప్రయత్నం ద్వారా ఒక్క లాఠీ విరగకుండా, ఒక్క తూటా పేలకుండానే కొన్ని వేల కోట్లు ప్రజలకు ఆదా అయిందని ధీమాగా చెప్పగలం. ఆ తర్వాత లోక్‌సత్తాకున్న పరిమిత వనరుల్ని నేరచరిత్రగల అభ్యర్థుల వివరాలను బహిర్గతం చేయటం నుంచి మరింత విస్తృత ప్రజాప్రయోజనాలందించే రాజకీయ, పాలనా సంస్కరణల వైపు మళ్లించింది.

ఆనాడు పరిష్కారమైన పెట్రో కొలతల అక్రమాలు, కల్తీ దోపిడీ సమస్య దాదాపు ఇరవయ్యేళ్ల తర్వాత కూడా కొనసాగుతుండటం, ప్రజల్ని దోచుకుంటుండటం బాధాకరం. ప్రజలు కాస్త చైతన్యవంతంగా కల్తీ, దోపిడీలేని సేవలు పొందే మార్గాన్ని లోక్‌సత్తా నాడు అందించింది. కానీ దాన్ని కాలక్రమంలో ప్రజలు వదిలేయటంతో సరైన వ్యవస్థ ఏర్పడక సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. మనమంతా రోజువారీ పనులు చూసుకుంటూ అప్రమత్తంగా ఉంటే తప్ప ఇలాంటి సమస్యల్ని పరిష్కరించుకోలేం. ఎంత గొప్ప నాయకులయినా మన ప్రమేయం లేకుండా వారంతటవారు ఏమీ చేయలేరు.

సరే, కొంత నష్టంతోనైనా మళ్లీ పరిష్కార యుద్ధాన్ని ప్రారంభిద్దాం. ఇక ముందు నష్టాన్ని నివారిద్దాం.

### మలిదశ పోరాటం

ఇరవయ్యేళ్ల క్రితం తెలుగు రాష్ట్రాలలో పదిహేను వందల పెట్రోల్ బంకులుండగా ఈవేళ అవి దాదాపు 5వేలకు పెరిగాయి. దేశవ్యాప్తంగా 55వేల దాకా ఉంటాయి. ప్రతి ఇంటిలో వాహనం కనిపిస్తోంది. పరిశ్రమలతోపాటు వ్యవసాయంలోనూ పెట్రో ఉత్పత్తుల వాడకం పెరిగింది. కాబట్టి ఈ మలిదశ పోరాటం వల్ల ప్రజలకు భారీగా డబ్బును ఆదా చేయవచ్చు. దేశవ్యాప్తంగా ఈ చైతన్యాన్ని ఇలాగే కాపాడుకుంటే రాబోయే కొన్నేళ్లలోనే లక్షల కోట్లు ప్రజలు లాభం పొందగలుగుతారు.

### ఏం చేద్దాం?

పెట్రోలు బంకుల అక్రమ కొలతలు, కల్తీలకు వ్యతిరేకంగా.. తొలిపోరాటంనాటిలాగే జయప్రకాష్ నారాయణ్ గారు తాజా ఉద్యమాన్ని కూడా తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభిస్తారు. కొన్ని వారాలపాటు జిల్లాల్లో దీన్ని పెద్దఎత్తున కొనసాగించాలి. విస్తరించాలి. లోక్‌సత్తా ఉద్యమకారులేకాకుండా, ప్రజలు, ముఖ్యంగా యువత, మహిళలు, వాహనాలు ఉపయోగించేవారందరూ ఈ పెట్రోల్ బంకుల తనిఖీల్లో పాల్గనాలని మనవి.

### ఎలా చేద్దాం?

1) ప్రతి పెట్రోలు బంకులో అందుబాటులో ఉంచే ఒక లీటరు, ఐదు లీటర్ల క్యాన్లను అడిగి తీసుకుని వాటిలో ఇంధనాన్ని నింపి చూపమనాలి. కొలతలో అక్రమం అక్కడే బైటపడిపోతుంది (ద్విచక్ర వాహనదారులు తమ బండిలోనే ఒక లీటరు లేదా రెండు లీటర్ల ఖాళీ ప్లాస్టిక్ బాటిల్ పెట్టుకుంటే, క్యాన్ల గురించి కూడా అడగకుండానే కొలత తీసుకోవచ్చు. కాస్త మందపాటి వాటర్‌బాటిల్‌లాంటిదాన్ని ఇందుకు ఉపయోగించుకోవచ్చు).

లేదా

ఎంత ఇంధనం ట్యాంకులో పడిందో కొలిచే పరికరాల్ని వాహనదారులు తమ బండి పెట్రోల్ ట్యాంకు మూత వద్ద అమర్చుకోవాలి. పెట్రోల్, డీజిల్ ఆ ట్యాంకులో పోసేటప్పుడు లీటర్లు, మిల్లీలీటర్లు సహా లెక్కగట్టి వివరాలను పరికరం తెరపై నమోదు చేస్తుంది. ముందే సెల్‌ఫోన్‌తో అనుసంధానం చేస్తే, ఆ వివరాలు సందేశం రూపంలో మొబైల్ ఫోన్‌కి అందుతాయి.

3) కల్తీని కొనుగొనడానికి ఒక టిష్యు పేపర్‌పై రెండు మూడు చుక్కల ఇంధనాన్ని వేసి చూడాలి.

4) ఇంధన సాంద్రత (డెన్సిటీ), ఉష్ణోగ్రత (టెంపరేచర్) పరీక్ష కూడా పది నిమిషాల్లో మనకు పెట్రోల్ బంకు యాజమాన్యం చేసి చూపించాలి.

5) ప్రతిరోజూ ఓ పదిమంది వినియోగదారులకు ఈ విధమైన పరీక్షలు చూపించి, ఒక రిజిస్టర్‌లో సంతకం తీసుకునేలా బంకు యాజమాన్యాలకు నిబంధనలు ఏర్పాటు చేయాలి. నిజాయతీగల బంక్ యాజమాన్యాలకు ఇందులో ఎటువంటి ఇబ్బందీ ఉండదు.

6) పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు మంచినీరు, రేడియేటర్లలో పోయటానికి నీరు, టైర్లలో గాలి నింపటం సేవల్ని ఉచితంగా అందించటం తప్పనిసరి చేయాలి.

7) పోయించుకున్న ఇంధనానికి సరిపడా వినియోగదారులకు బిల్లులు తప్పనిసరిగా ఇచ్చేలా చేయాలి.

ప్రతిరోజూ కాకున్నా, వారానికి ఒకటిరెండుసార్లు ప్రజలు బంకుల్లో ర్యాండమ్‌గా ఇలా పరీక్షలు చేస్తుంటే, దోపిడీ బంక్ యాజమాన్యాలకు, అవినీతి అధికారులకు చెక్ పడుతుంది, భారీ సొమ్ము ఆదా అవుతుంది.

**'విషయ పరిజ్ఞానం + కలసికట్టుగా ప్రజాఉద్యమం = సురాజ్యం'**

**Join & Participate: www.youthforbetterindia.com**

# 'జనం కోసం జేపీ' సురాజ్య యాత్ర... మరిన్ని క్లిక్‌లు















Posting Date 22-10-2017
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on October16th 2017

**ప్రజాసేవ అంటే ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకు వచ్చే పనులు చేయడం! సొంత ఆస్తులు పెంచుకోవడం కాదు !**



# సంస్కరణలు

విద్య
ఆరోగ్యం
రాజకీయాలు

ఎన్నికలు
స్థానిక ప్రభుత్వాలు
సర్వీసుగ్యారంటీ

ప్రజల జీవితాల్లో, వ్యవస్థలో నిజమైన మార్పు తీసుకువచ్చే అత్యంత ప్రభావవంతమైన అంశాల పై FDR (NGO) పనిచేస్తుంది. ఇప్పటికే కొన్ని అంశాలు పార్లమెంటు, నీతి ఆయోగ్ పరిశీలనలో ఉన్నాయి. మా ప్రయత్నాలకు బలం చేకూర్చే విధంగా విరాళాలు అందించండి.

**donate@:**

**donate.fdrindia.org**

* Donation amount is exempted as per 80G of IT act

for more:www.fdrindia.org

Book-Post
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

To

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B, 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad